సోమవారం
29-01-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 217
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మళ్లీ క్రూయిజ్ క్షిపణులు ప్రయోగించిన ఉ.కొరియా

సియోల్: ఉత్తర కొరియా ఆదివారం తూర్పు తీరంలో అనేక క్రూయిజ్ మిసైళ్లు ప్రయోగించింది. ఇలా మిసైళ్లను ప్రయోగించడం వారంలో రెండవ సారిగా దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ (జేసీఎస్) తెలిపింది. ఉదయం 8 గంటలకు క్షిపణులను ఉత్తర కొరియా ప్రయోగించినట్లు దక్షిణ కొరియా, అమెరికా ఇంటెలిజెన్స్ అధి కారులు ధ్రువీకరించాయని వెల్లడించింది. అయితే ఎన్ని క్షిపణుల ప్రయోగం జరిగింది, అవి ఎంత దూరం వెళ్లాయి వంటి వివరాలు తెలపలేదు. నిఘాను మరింత పెంచినట్లు జేసీఎస్ ఓ ప్రకటన చేసింది. తమ సైన్యం, అమెరికాతో కలిసి ఉత్తర కొరియాపై నిఘా పెట్టిందని, ఆ దేశ కార్యకలా పాలను నిశితంగా గమనిస్తోందని వెల్లడించింది.

చల్లారని అసంతృప్తి

ఐదో జాబితాపై టెన్షన్

- సిట్టింగ్ ఎంపీల సీట్లు గల్లంతు
- కొత్త ముఖాలకే అవకాశం
- మంత్రి పెద్దిరెడ్డిపై కోనేటి ఆదిమూలం ఆగ్రహం
- టీడీపీలోనూ భగ్గుమన్న నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
వైసీపీ ఐదో జాబితాపై ఆశావాహులు ఆందోళన చెందుతున్నారు. ఈ జాబితాలో అత్యధికంగా ఎంపీ స్థానాలను ప్రకటించనున్నారు. వాటితోపాటు కొన్ని ఎమ్మెల్యే స్థానాలకూ చోటు కల్పిస్తారు. మరో నాలుగు స్థానాలకు మార్పులు, చేర్పులు చేపట్టే అవకాశముంది. ఇప్పటివరకు వెల్లడైన నాలుగు జాబితాల ఆధారంగా పదిమంది ఎంపీ అభ్యర్థులను ప్రకటించారు. ఐదో జాబితాలో మరో 13 మంది ఎంపీ పేర్లు వెల్లడయ్యే అవకాశముంది. దీని ఆధారంగా చూస్తే దాదాపు 22 మంది సిట్టింగ్ ఎంపీలకు సీట్లు గల్లంతవుతాయి. కొందరు ఎంపీలను ఎమ్మెల్యేలుగా బరిలోకి దించుతున్నారు. విశాఖ ఎంపీ సత్యనారాయణను ఎమ్మెల్యేగా పోటీ చేయిస్తున్నారు. నెల్లూరు ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా బరిలో దించారు. దీంతో వారికి కనీసం ఎమ్మెల్యే సీట్లయినా దక్కగా, మిగిలిన సిట్టింగ్ ఎంపీలకు షాక్ తగిలింది. ఎంపీ స్థానాలపై చాలా వరకు స్పష్టత రాగా, నాలుగు స్థానాలపై ఇంకా కసరత్తు కొనసాగుతోంది. విజయనగరం, అనకాపల్లి, రాజమండ్రి, ఏలూరు, నరసాపురం, మచిలీపట్నం, నరసారావుపేట, ఒంగోలు, తిరుపతి, కర్నూలు, అనంతపురం తదితర సిట్టింగ్ ఎంపీలకు సీట్లు ఉండే అవకాశాలు లేవు. ఉన్న సిట్టింగ్ ఎంపీలలో కడప, రాజంపేట, బాపట్ల ఎంపీలకే తిరిగి టికెట్లు ఇస్తారని తెలిసింది. ఐదో జాబితా ఆధారంగా ఈ ఎంపీల సీట్లపై ఒక స్పష్టత రానుంది. మచిలీపట్నం ఎంపీ బాలశౌరికి టికెట్ లేదని చెప్పడంతో ఆయన జనసేనలో చేరారు. నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను గుంటూరు ఎంపీగా వెళ్లాలని సూచించగా... ఆయన తిరస్కరించి, పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. దీంతో అధిష్ఠానం నరసరావుపేట ఎంపీ స్థానాన్ని బీసీలకు కేటాయించాలని నిర్ణయించింది. దీంతో మాజీ మంత్రి, నెల్లూరు టౌన్ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్‌ను నరసరావుపేట ఎంపీ బరిలో దించనున్నారు. ఇక గుంటూరు ఎంపీ బరిలో వైసీపీ సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు బంధువు ఉమ్మారెడ్డి వెంకటరమణ పేరును తెరపైకి తెచ్చారు. మచిలీపట్నం ఎంపీగా అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్ , లేదా మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని పేర్లను పరిశీలిస్తున్నారు. కర్నూలు ఎంపీ టికెట్ కర్నూలు నగర మేయర్ బీవై రాములుకు ఇవ్వాలని నిర్ణయించారు. కాకినాడ నుంచి చలమలశెట్టి సునీల్, విజయనగరం నుంచి మజ్జి శ్రీనివాస్, అమలాపురం నుంచి ఎంపీ అభ్యర్థులుగా చింతలపూడి ఎలిజా పేర్లు పరిశీలనలో ఉన్నాయి. నంద్యాల ఎంపీ స్థానానికి సినీనటుడు అలీ లేదా కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ పేర్లు

- మిగతా 2 లో

నేడు రెబల్ ఎమ్మెల్యేలపై
అనర్హత పిటిషన్ల విచారణ
2లో

6 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు?

- నాలుగు నుంచి ఐదు రోజుల నిర్వహణ
- కీలక ప్రకటనలు వెలువడే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
ఆంధ్రప్రదేశ్ శాసన సభ వేదికగా ఫిబ్రవరి 6వ తేదీ నుంచి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. నాలుగు నుంచి ఐదు రోజులపాటు ఈ అసెంబ్లీ సమావేశాలు కొనసాగే అవకాశం ఉంది. ఎన్నికలకు ముందు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలను ప్రభుత్వాలు ఆనవాయితీగా నిర్వహిస్తాయి. మూడు నుంచి నాలుగు నెలలకు సంబంధించిన బడ్జెట్ అంచనాలను రూపొందిస్తారు. ఎన్నికల ముందు ఇవి చివరి అసెంబ్లీ సమావేశాలు కానున్నాయి. దీంతో ఈ బడ్జెట్ సమావేశాలపై సర్వత్రా చర్చ కొనసాగుతోంది. ఈ సమావేశాల ద్వారా సీఎం జగన్ ప్రభుత్వం కొత్త సంక్షేమ పథకాలపైన, కీలక నిర్ణయాలను వెల్లడిస్తుందని సమాచారం. నాలుగున్నరేళ్లల్లో ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని అసెంబ్లీ వేదికగా ప్రజలకు వివరించనున్నారు. ఉద్యోగ నియామకాలపైనా కావాల్సిన వనరులకు సంబంధించి నిర్ణయాలను వెల్లడిస్తారని సమాచారం. ఉపాధ్యాయ నియామక భర్తీలకు సంబంధించిన డీఎస్సీపై ఒక స్పష్టత వస్తుందని నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికలు పూర్తయిన

- మిగతా 2 లో

తిరిగి ఎన్డీయేలోకి నితీశ్

- బీహార్ సీఎంగా తొమ్మిదోసారి ప్రమాణ స్వీకారం
- ఉప ముఖ్యమంత్రులుగా సమ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా

పాట్నా:
బీహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్ పిల్లిమొగ్గలు వేసుకుంటూ తిరిగి ఎన్డీయే గూటికి చేరుకున్నారు. ఓ రోజు ఇండియా కూటమిలో మరో రోజు ఎన్డీయే కూటమిలో అన్నట్లు ఆయారామ్ గయారామ్ రాజకీయాలు చేస్తూ రాష్ట్రంలో మహాకూటమికి, విపక్ష ఇండియా కూటమికి వెన్నపోటు పొడిచి నాటకీయ పరిణామాల నడుమ కమలనాథులతో చేతులు కలిపారు. బీహార్‌లో బీజేపీతో కలిసి కొత్త ప్రభుత్వాన్ని నితీశ్ కుమార్ ఏర్పాటు చేశారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా తొమ్మిదోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ సమక్షంలో రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఉప ముఖ్యమంత్రులుగా బీజేపీ నేతలు సమ్రాట్ చౌదరి, మాజీ స్పీకర్ విజయ్ కుమార్ సిన్హా కూడా ప్రమాణం చేశారు. వీరిద్దరు బీజేపీ శాసనసభపక్ష నేతలుగానూ ఎన్నికయ్యారు. జేడీయూ నాయకులు విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర యాదవ్, శ్రవణ్ కుమార్‌తో పాటు సంతోశ్ కుమార్ సుమన్ (హిందుస్థాన్ అవామ్ మోర్చా), స్వతంత్ర శాసనసభ్యుడు సుమిత్ సింగ్ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో అతిపెద్ద పార్టీ ఆర్జేడీ నుంచి ఒక్కరు కూడా హాజరు కాకపోగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు ఆ పార్టీ సీనియర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజీనామా చేసిన కొద్ది గంటల్లోనే నితీశ్ ప్రమాణ స్వీకారం జరగడం చర్చనీయాంశమైంది.

ఇది ముగింపు కాదు ఆరంభం: తేజస్వి

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ నాశనమవుతుందని... ఇది ముగింపు కాదు ఆరంభమని ఆర్జేడీ యువ నేత తేజస్వీ యాదవ్ గర్జించారు. ఇప్పటివరకు ఉప ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన కూటమిని వీడినట్లు ప్రకటించారు. ఊసరవెల్లికి పోటీ ఇస్తున్నారంటూ నితీశ్‌నుద్దేశించి మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్, ఆయన

- మిగతా 2 లో

అధికారం కోసం జగన్ ఆరాటం

- వైసీపీ పాలనలో అందరూ బాధితులే
- నెల్లూరు సభలో చంద్రబాబు

3లో

నేటి చట్టాలే రేపటి భారత్‌కు బలం

సుప్రీంకోర్టు వజ్రోత్సవ సభలో మోదీ

8లో

బీజేపీకి ఓటమి భయం

- అందుకే 'ఇండియా'ను బలహీనపరిచే ప్రయత్నాలు
- సీపీఐ కార్యదర్శి నారాయణ విమర్శ

విశాలాంధ్ర–హైదరాబాద్:
ఓటమి భయంతోనే 'ఇండియా కూటమి'ని కేంద్రంలోని బీజేపీకి ప్రభుత్వం బలహీనపర్చేందుకు ప్రయత్నిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. ఇండియా కూటమిలో కీలక పాత్ర పోషించిన బీహార్ సీఎం నితీశ్ కుమార్ 'కక్కిన కూడు తినేందుకే' తిరిగి ఎన్డీయే కూటమిలోనికి వెళ్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటి వరకు ఎన్డీయేకు వ్యతిరేకంగా ఉండి, ఇండియా కూటమిలో ఉన్నవారు తిరిగి ఎన్డీయే కూటమికి వెళ్లడం 'కక్కిన కూడు తినేందుకే'నని వ్యాఖ్యానించారు. సీపీఐ జాతీయ సమితి సమావేశాలు ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్నాయని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, పశ్యపద్మ, ఈటీ నర్సింహతో కలిసి ఇక్కడి మఖ్దుంభవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ మోడీ పదేళ్ల కాలంలో సాధించింది ఏమీ లేదని, అందుకే 'శ్రీరాముని' పేరుతో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కేంద్రంలోని బీజేపీది 'మోస్ట్

- మిగతా 2 లో

ఆక్వా రంగం కుదేలు

- సమస్యల సుడిలో రైతులు
- కొరవడిన నాణ్యమైన సీడ్
- ఫీడ్, కెమికల్ కంపెనీల దోపిడీ
- ధరలను శాసిస్తున్న వ్యాపారులు, దళారులు
- ప్రభుత్వం నియంత్రణ అవసరం

విశాలాంధ్ర బ్యూరో–ఏలూరు:
ఆక్వా రైతుల్ని సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. గత్యంతరం లేని స్థితిలోనే రైతులు రొయ్యల పెంపకం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాంతం అంటే పచ్చటి మాగాణి పంట పొలాలకు ప్రసిద్ధి. అటువంటి తీర ప్రాంతం నేడు ఆక్వా సాగు శకలాలతో రూపు మా రిపోయింది. నింగికేగిన తారాజువ్వ తరహాలో ఒక వెలుగు వెలిగిన ఆక్వా రంగం నేడు పతనం చెందడం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. రైతుల అవగాహన రాహిత్యానికి తోడు సీడ్, ఫీడ్ కంపెనీల స్వార్థం... వ్యాపారులు, దళారుల మోసం దాగి ఉన్నాయి. జిల్లాలో తొలినాళ్లలో ఆక్వా రంగంలోకి దిగిన వారు ఆర్థికంగా నిండా మునిగి నేడు సాగుకు దూరంగా ఉన్నారు. పచ్చటి పంట పొలాలను రొయ్యల గుంటలుగా చేసి ఉప్పుమయంగా తయారైన వాటిని తిరిగి వరి పంటకు వినియోగించుకోలేక తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇంకా కొంతమంది ఆక్వా సాగు చేస్తున్నారు. ఏ పంట కైనా విత్తనం నాణ్యంగా ఉంటే పంట బాగుంటుంది. ఆక్వా సాగు అందుకు మినహాయింపు కాదు. నాణ్యమైన రొయ్య పిల్ల ఉంటే సేద్యంలో లాభాలకు సగం భరోసా కచ్చితంగా ఉంటుంది. ఆక్వా సేద్యం ప్రారంభమైన తొలినాళ్లలో టైగర్ సాగును చేపట్టిన రైతులు తదనంతరం స్కాంపి, వనామి సాగు చేస్తున్నారు. అయితే ఈ సాగులోనూ నాణ్యమైన విత్తన కొరత రైతులను పీడిస్తూనే ఉంది. ఇష్టా రీతిగా టైగర్ సాగు చేసిన రైతులు చివరకు నష్టాలను మూట కట్టుకున్నారు. స్కాంపి సాగులోను అంతే. నేర్చుకున్న గుణపాఠాలను వనామీ సాగులో ఏమన్నా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఊసరవెల్లి ముదిరితే నితీశ్

- ఆర్వీ రామారావ్

టిప్పణి

తొండ ముదిరితే ఊసరవెల్లి అవుతుందన్నది సామెత. ఊసరవెల్లి రంగులు మారుస్తుందంటారు. మరి ఊసరవెల్లి ముదిరితే లేక వయసు మీరితే ఏమవుతుందన్న అనుమానం రాక తప్పదు. జవాబు చాలా సులభం నితీశ్ కుమార్‌గా మారుతుంది. ఊసరవెల్లి రంగులు మార్చడంవల్ల ప్రకృతికి నష్టమేమీ లేదు. కానీ మాటిమాటికి రంగులు మార్చే నితీశ్ కుమార్ లాంటివారి వల్ల రాజకీయాలు గందరగోళంలో పడతాయి. మరింత భ్రష్టు పడతాయి. అంతిమంగా బీజేపీ ప్రయోజనం పొందుతుంది. ఒక పార్టీతో జట్టు కట్టి ఎన్నికల్లో పోటీ చేసి తీరా విజయం సాధించిన తరవాత మరో పార్టీతో పొత్తు పెట్టుకోవడం నితీశ్ కుమార్‌కు అలవాటుగా మారింది. తొమ్మిదో సారి ముఖ్యమంత్రి కావడం కోసం ఆయన ఆర్‌జేడీతో సంబంధాలు తెంచుకుని బీజేపీతో పొత్తు పెట్టుకుంటున్నారు. ఆర్‌జేడీ వల్ల నితీశ్ కుమార్‌కు ఏం ఇబ్బంది వచ్చిందో ఆయన ఏ రోజునా చెప్పిన పాపాన పోలేదు. కానీ రాజీనామా చేసిన తరవాత ఆర్‌జేడీ మిగతా కొన్ని పార్టీల కలిపి ఏర్పాటైన మహాఘట్బంధన్ పరిస్థితి అంత సుఖమయంగా లేదు అని అభాండం వేశారు. ఒకప్పుడు బీజేపీతో మరొకప్పుడు ఆర్‌జేడీతో కలిసి ప్రభుత్వాలు ఏర్పాటు చేయడానికి ఆయనకు తన అస్తిత్వం మీద తనకే నమ్మకం లేకపోవడమే ప్రధాన కారణం. ఇతర కారణాలూ ఉన్నాయి. నితీశ్ చొరవతోనే ఏర్పడ్డ "ఇండియా" కూటమితో ఉంటే తనకు భవిష్యత్తు భద్రంగా ఉండదని నితీశ్ భావించారు. ప్రధానమంత్రి పదవి మీద తనకు ఆశేమీ లేదని నితీశ్ అనేకసార్లు చెప్పారు. నిజానికి ఆయనకు ఆ ఆకాంక్ష ఉన్న తప్పేమీ లేదు. "ఇండియా" ఐక్య సంఘటనలో హిందీ మాట్లాడే రాష్ట్రాలలో నితీశ్‌కు మంచి పలుకుబడే ఉంది. ఇండియా ఐక్య సంఘటనకు తనను సమన్వయ కర్తను చేయాలని ఆయన అనుకున్నట్టున్నారు. కానీ మమతా బెనర్జీ, కేజ్రీవాల్ లాంటి వారు వ్యతిరేకిస్తున్నందువల్ల వారికి నచ్చ చెప్పిన తరవాత నిర్ణయించాలని ఇండియా నాయకులు భావించారు. కానీ నితీశ్ మాత్రం నిరాశచెందారు. నితీశ్ సిద్ధాంత ప్రాతిపదిక లేని వ్యక్తి కాదు. ఆయన సోషలిస్టు. ఆ భావాలు ఇంకా పూర్తిగా ఇంకి పోలేదు అనడానికి ఆయన పాలనలోనే మూలాలు కనిపిస్తాయి. అందుకనే ఆయనను సుశాన్ బాబు అనే వారు. వ్యక్తిగతంగా సెక్యులర్ వాదే. కానీ సెక్యులరిజాన్ని నిలువెత్తు లోతుల్లో పాతి పెట్టడానికి కంకణం కట్టుకున్న బీజేపీతో పొత్తు కుదుర్చుకోవడానికి సిద్ధపడడం అంటే ఆ మతత్వ శక్తులతో పోరాడే సంకల్పం కూడా ఆయనలో అంతరించిందని అనుకోవాలి.

బీజేపీతో చేయి కలపడంవల్ల ఆయనకు ఏమైనా ప్రయోజనం ఉంటుందనుకున్నా అదీ కనిపించడం లేదు. మహా అయితే 2025లో జరగవలసిన శాసనసభ ఎన్నికల దాకా బీజేపీ ఆయనను అధికారంలో ఉండనిస్తుంది. ఆ తరవాత నితీశ్ పార్టీకే ఎసరు పెట్టడం ఖాయం. బీజేపీ గత చరిత్రే దీనికి నిదర్శనం. మహారాష్ట్రలో భావ సారూప్యత ఉన్న శివసేనను అంతం చేయాలని బీజేపీ కుట్ర పన్నింది. చివరకు ఆ పార్టీని చీల్చింది. అదే రీతిలో ఎన్సీపీనీ విడగొట్టింది. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి పదవిని వదిలే ఆలోచనలో నితీశ్ లేరు. పోనీ ఆయన కేంద్ర ప్రభుత్వంలో చేరాలనుకున్నా అదీ సార్వత్రిక ఎన్నికల తరవాత కానీ తేలదు. ఒక వేళ ఆ అవకాశమే వచ్చినా ఆయనకు పిలిచి పెద్ద పీట ఏమీ వేయరు. మొదటి నుంచి పది స్థానాల్లో మోదీనే ఉంటారు. 11వ స్థానం అమిత్ షాది. ఆ తరవాత నిర్మలా సీతారమన్, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరి తరవాతి స్థానమే నితీశ్‌కు దక్కుతుంది. బీహార్ శాసనసభలో సీట్ల లెక్కన చూస్తే ఆయన పార్టీ మూడో స్థానంలో ఉంది. బీజేపీతో గతంలో పొత్తుకుదినప్పుడూ, ఆ తరవాత ఆర్‌జేడీ తదితర ఇండియా ఐక్య సంఘటనలోని పక్షాలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడూ ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగడానికి అంగీకరించారు. బీహార్‌లో నితీశ్ నాయకత్వంలోని జేడీయూను అంతం చేసే దాకా బీజేపీ నిద్రపోదు. గత ఎన్నికలలోనే ఆయన పార్టీని తగ్గించడానికి

- మిగతా 2 లో

అర్జెంటైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కోట్ మృతి

బ్యూనోస్ ఏయిర్స్: అర్జెంటైనా కమ్యూనిస్టు పార్టీ (పీసీఏ) ప్రధాన కార్యదర్శి విక్టర్ కోట్ కన్నుమూశారు. ఆయన మరణవార్తను పీసీఏ ప్రకటించింది. 'అర్జెంటైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి విక్టర్ కోట్ మన మధ్య లేరని తెలియజేయడానికి చింతిస్తున్నాం' అని పేర్కొంది. కార్మికుల ఉద్యమకర్తగా, సోషలిజం కోసం జీవితం మొత్తం పోరాడిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని పేర్కొంది. విద్యార్థి దశలోనే రాజకీయ కార్యకలాపాల్లో క్రియాశీలంగా ఉండే విక్టర్ కోట్ అప్పట్లో కమ్యూనిస్టు యూత్ ఫెడరేషన్‌కు నాయకుడిగా ఎన్నికయ్యారని, ఆపై అర్జెంటైనా కమ్యూనిస్టు పార్టీలో వివిధ బాధ్యతలు చేపట్టారని తెలిపింది. 'కౌడెర్నోస్ మార్క్సిస్ట్స్' ప్రచురణ ద్వారా సైద్ధాంతిక పోరునకు తోడ్పాటు అందించారని వెల్లడించింది. లాటిన్ అమెరికాలో అంతర్జాతీయ సంఘీభావాన్ని పెంపొందించారని పీసీఏ ప్రకటన పేర్కొంది. కార్మిక ఉద్యమానికి, సోషలిజం కోసం ఆయన అందించిన తోడ్పాటు చిరస్మరణీయమని శ్లాఘించింది. 'హస్తల విక్టోరియా సియంప్రె కామ్రేడ్ విక్టర్ కోట్!' అంటూ తమ నాయకుడికి పీసీఏ అంతిమ వీడ్కోలు పలికింది.

ఏకకాలంలో మూడు ఉపగ్రహాలు ప్రయోగించిన ఇరాన్

టెహ్రాన్: దేశీయంగా అభివృద్ధి చేసిన సిమోర్గ్ రాకెట్ ద్వారా మూడు బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. వాటిని ఏకకాలంలో నిర్దేశిత కక్ష్యకు చేర్చినట్లు ఆదివారం ప్రకటించింది. సెమ్నాన్ ప్రావిన్స్‌లోని ఇమామ్ ఖొమైని స్పేస్‌పోర్ట్ నుంచి ప్రయోగం రాత్రి జరిగినట్లు వార్తాసంస్థలు తెలిపాయి. మెహ్‌దా, కన్హన్-2, హటెఫ్-1 ఉపగ్రహాలను సిమోర్గ్ రాకెట్ ద్వారా ప్రయోగించినటు వెల్లడించాయి. గతంలో ఐదు సార్లు సిమోర్గ్ ప్రయోగాలు విఫలం అయ్యాయి. తాజాగా ప్రయోగించిన ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తున ఉన్న కక్ష్యలోకి సిమోర్గ్ రాకెట్ చేర్చిందని అధికారిక ప్రకటన తెలిపింది. ఈ మూడింటిలో 35 కిలోల ఉపగ్రహం ఒకటి ఉండగా మిగిలినవి 10 కిలోల లోపు బరువుగల నానో ఉపగ్రహాలని వెల్లడించింది. జియో పొజిషనింగ్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ల కోసం వీటిని వినియోగిస్తామని తెలిపింది. కాగా, ఇరాన్ సైనిక విభాగం 'ఐఆర్‌జీసీ' తయారు చేసిన 'సొరయా' ప్రయోగం ఇటీవల విజయవంతంగా జరిగిన విషయం తెలిసిందే.

చిక్కుల్లో 'ఐరాస పలస్తీనా'

- హమాస్‌కు మద్దతిచ్చినట్లు ఇజ్రాయిల్ ఆరోపణలు
- నిధులు నిలిపివేసిన తొమ్మిది దేశాలు

లండన్: పలస్తీనియన్ల కోసం పనిచేసే ఐక్యరాజ్య సమితి శరణార్థి సంస్థ (యూఎన్ఆర్ డబ్ల్యూఏ) చిక్కుల్లో పడింది. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడాతో పాటు మరో ఆరు యూరప్ దేశాలు తాజాగా నిధులు నిలిపివేస్తూ ప్రకటన చేశాయి. యూఎన్ఆర్‌డబ్ల్యూఏకు నిధులను ఆపేస్తున్నామని బ్రిటన్, జర్మనీ, ఇటలీ, నెథర్లాండ్స్, స్విట్జర్లాండ్, ఫిన్లాండ్ దేశాలు తెలిపాయి. దీంతో ఈ సంస్థ పశ్చిమాసియాలో చేపట్టే మానవతా కార్యాచరణకు విఘాతం కలుగుతోంది. అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై హమాస్ జరిపిన దాడుల్లో ఈ సంస్థ సిబ్బంది మద్దతిచ్చినట్లు యూద దేశం చేసిన ఆరోపణలతో ఈ పరిణామం చోటుచేసుకుంది. దీంతో పలస్తీనా ప్రజలకు ప్రధాన మద్దతు నిలిచినట్లు అయ్యింది. ఇప్పటికే కష్టాల్లో ఉన్న గాజాలోని పలస్తీనియన్లకు ఈ అదనపు సమ్మిళిత శిక్ష తగదని యూఎన్ఆర్‌డబ్ల్యూఏ కమిషనర్ జనరల్ ఫిలిప్ లజారిని 'ఎక్స్'లో ఆందోళన వ్యక్తంచేశారు. తొమ్మిది దేశాల తీసుకున్న ఈ నిర్ణయంతో పశ్చిమాసియాలో ముఖ్యంగా గాజాలో మానవతా కార్యక్రమాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. సిబ్బందిలో ఎవరో కొందరు ఏదో చేశారని సంస్థ మొత్తాన్ని ఇబ్బంది పెట్టడం, నిధులు నిలిపివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ పరిణామం తనను షాక్‌కు గురి చేసిందని పేర్కొన్నారు. యూఎన్ఆర్ డబ్ల్యూఏకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ ప్రచారం చేస్తోందని పలస్తీనా విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది. జియోనిస్ట్ శత్రువు చెప్పే అబద్ధాలు నమ్ముతూ ఇలా తప్పుడు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టింది. కాగా, తమ సంస్థ సిబ్బందిపై వచ్చిన ఆరోపణల మీద విచారణ జరిపిస్తున్నట్లు యూఎన్ఆర్‌డబ్ల్యూఏ ఇంతకుముందే తెలిపింది. సంబంధిత ఉద్యోగులను తొలగించినట్లు వెల్లడించింది. అయితే నిధులను నిలిపివేసే దేశాల జాబితాలో మరిన్ని దేశాలు చేరాలంటూ ఇజ్రాయిల్ కోరుతోంది. గాజాలో పోరు ముగిసిన తర్వాత యూఎన్ఆర్ డబ్ల్యూఏను భర్తీ చేయాలని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ అన్నారు. దీనిపై ఐరాస అధికార ప్రతినిధి ఫర్హాన్ హక్ స్పందిస్తూ యూఎన్ ఆర్‌డబ్ల్యూఏకు పటిష్ఠ రికార్డు ఉన్నదని, దానిని నిర్లక్ష్యం చేయలేమని తెలిపారు. ఎవరు ఏం చెబితే అది గుడ్డిగా నమ్మేయలేమని, నిజనిజాలను నిర్ధారించుకున్న తర్వాత తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉగ్రచర్యలకు సహకరిస్తే ఉపేక్షించం: గుటెర్రస్

ఉగ్రవాద చర్యలకు పాల్పడే ఉద్యోగులను ఉపేక్షించేది లేదని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ఆదివారం తేల్చిచెప్పారు. అదే సమయంలో యూఎన్ఆర్‌డబ్ల్యూఏకు నిధులు నిలిపివేయడం సరైనది కాదని ప్రపంచ దేశాలకు సూచించారు. 'మీ మద్దతును కొనసాగించండి' అని నిధులు ఆపేసిన తొమ్మిది దేశాలను కోరారు. 'ఉగ్రవాద చర్యలతో సంబంధం ఉండే ఐరాస ఉద్యోగి అందుకు జవాబుదారీ వహించాలి. క్రిమినల్ విచారణను ఎదుర్కోవాలి' అని గుటెర్రస్ స్పష్టంచేశారు. సంబంధిత యంత్రాంగానికి సహకరించేందుకు సెక్రటేరియట్ సిద్ధంగా ఉందన్నారు. లక్షల మంది పురుషులు, మహిళలు యూఎన్ఆర్‌డబ్ల్యూఏలో పనిచేస్తున్నారని, వీరిలో అనేక మంది అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో మానవతా సేవలు అందిస్తున్నారని, ఇలాంటి వారికి ఇబ్బంది కలిగించవద్దని కోరారు. అలాగే ఆపన్నహస్తం కోసం ఎదురుచూసే అభాగ్యులకు తమ సిబ్బంది ద్వారా అందే సహాయ సహకారాలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. మరోవైపు 12 మంది నిందితుల్లో ఒకరు చనిపోగా మరో తొమ్మిది మందిని విధుల్లో నుంచి తొలగించినట్లు తెలిపారు. ఇంకో ఇద్దరు గురించి ఆరా తీస్తునట్లు చెప్పారు. తమ సంస్థ సిబ్బందిపై ఉగ్రవాద ఆరోపణలు కలచివేశాయని, పారదర్శకత విషయంలో రాజీ పడబోమని, నిందితులను ఉపేక్షించేది లేదని గుటెర్రస్ అన్నారు.

నేడు రెబల్ ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ల విచారణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ, టీడీపీ నుంచి పార్టీలు మారిన రెబల్ ఎమ్మెల్యేలపై సోమవారం అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ విచారణ చేపడతారు. ఇప్పటికే రెండు పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయా పార్టీల రెబల్ ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీజేసిన విషయం విదితమే. వారంతా వ్యక్తిగతంగా హాజరు కావాలని స్పీకర్ కార్యాలయం ఆదేశించింది. ఈ మేరకు ఉదయం 11 గంటలకు వైసీపీకి చెందిన నలుగురు రెబల్ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం వెంకట నారాయణరెడ్డి, మేకతోటి చంద్రశేఖర్ రెడ్డి, ఉండవల్లి శ్రీదేవికి నోటీసులు జారీజేశారు. ఇందులో మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి అనారోగ్య కారాణాలతో హాజరు కాలేమని స్పీకర్ కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. మిగిలిన ఇద్దరు రెబల్ ఎమ్మెల్యేలు ఆనం, కోటంరెడ్డి హాజరుపై స్పష్టత రావాల్సి ఉంది. మధ్యాహ్నం నుంచి టీడీపీకి చెందిన నలుగురు రెబల్ ఎమ్మెల్యేలు మద్దాల గిరి, కరణం బలరామ్, వల్లభనేని వంశీ, వాసుపల్లి గణేశ్ హాజరు కావాలని ఆదేశించారు. ఇందులో మద్దాల గిరి మాత్రం తాను విదేశీ పర్యటనలో ఉన్నానని, తర్వాత హాజరవుతానని స్పీకర్ కార్యాలయానికి వివరణ ఇచ్చారు. ఒక్కో ఎమ్మెల్యేతో స్పీకర్ వ్యక్తిగతంగా సమావేశమై వారితో చర్చిస్తారు. వారిచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోతే అనర్హత వేటు వేసే అవకాశం ఉంది. స్పీకర్ కార్యాలయానికి టీడీపీ, వైసీపీ రెబల్ ఎమ్మెల్యేల హాజరుపై ఉత్కంఠ నెలకొంది. వారు హాజరవుతారా?, లేదా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే ఒకరిద్దరు తాము అందుబాటులో లేమని, అనారోగ్యంతో బాధపడుతున్నామని స్పీకర్ కార్యాలయానికి సమాచారం ఇచ్చిన విషయం విదితమే. ఈ ఎమ్మెల్యేలు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇచ్చినా, వివిధ కారణాల రీత్యా హాజరు కాకపోయినా స్పీకర్‌కు తన విచక్షణాధికారంతో నిర్ణయం తీసుకుంటారు. అటు శాసన మండలిలోనూ అనర్హత వేటుపై విచారణ కొనసాగనుంది. వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలోకి వెళ్లిన ఇద్దరు ఎమ్మెల్సీలకు శాసన మండలి కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

వైసీపీలో చల్లారని అసంతృప్తి

(మొదటిపేజీ తరువాయి)

ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ఎంపీ స్థానాలతోపాటు కొన్ని ఎమ్మెల్యే స్థానాలకూ మార్పులు, చేర్పులు చేయనున్నారు.

తిరుపతి ఎంపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం అసంతృప్తి

తిరుపతి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన కోనేటి ఆదిమూలం తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. సత్యవేడు ఎమ్మెల్యేగా ఉన్న కోనేటి ఆదిమూలంను తిరుపతి ఎంపీగా వైసీపీ అధిష్ఠానం బరిలోకి దించింది. దీంతో మంత్రి పెద్దిరెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన వల్లే తనను ఎమ్మెల్యే నుంచి తిరుపతి ఎంపీ స్థానానికి మార్చారంటూ విమర్శించారు. తనకు ఎమ్మెల్యే టికెట్ రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. తాజాగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ గురుమూర్తి అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశానికి కోనేటి ఆదిమూలం హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. దీంతో కోనేటి ఆదిమూలం పార్టీని వీడతారన్న ప్రచారముంది. ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మళ్లీ అలక వహించారు. తన నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వడం లేదని బహిరంగంగా వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. దీంతో ఆయన కూడా పార్టీ వీడతారన్న ప్రచారముంది.కొంత కాలం నుంచి వసంత కృష్ణప్రసాద్ అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికే మూడు సార్లు ఆయనను క్యాంపు కార్యాలయానికి పిలిపించి వైసీపీ ముఖ్యనేతలు మాట్లాడారు. తిరిగి మైలవరం నుంచి బరిలో దిగాలని ఆదేశించినప్పటికీ, ఆయన అసంతృప్తితో ఉండటం పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది.

టీడీపీలోనూ అసంతృప్తి సెగ

మరోపక్క ప్రతిపక్ష టీడీపీలోనే అసంతృప్తి సెగ రాజుకుంది. టీడీపీ-జనసేన పొత్తులో భాగంగా ఆ రెండు పార్టీలు ఇటీవల చెరో రెండు సీట్లకు అభ్యర్థుల్ని ప్రకటించడంతో ఆయా పార్టీల అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండపేటలో టీడీపీ నేతలు నిరసనకు దిగారు. పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథికి నూజివీడు టిక్కెట్‌ను టీడీపీ ఖరారు చేసిందన్న సమాచారంతో అక్కడ ఇన్‌చార్జి ముద్దరబోయిన పార్టీ అనుచరులతో ఆత్మీయ సమావేశానికి సిద్ధమయ్యారు. అటు పెనమలూరులో పార్థసారథికి టికెట్ ఇస్తే సహించేదీ లేదంటూ మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వర్గీయులు ఇప్పటికే అధిష్ఠానానికి అల్టిమేటం జారీజేశారు. దీంతో పార్థసారథిని నూజివీడుకు పంపే దిశగా టీడీపీ నిర్ణయించినట్లు సమాచారం. ఫిబ్రవరి1 తర్వాత ఆయన టీడీపీలో చేరనున్నట్లు తెలిసింది. పెనమలూరు టీడీపీ టికెట్ బోడే ప్రసాద్‌కు ఇవ్వడంపై ఇంకా స్పష్టత రాలేదు. రాబోయే ఎన్నికల నుంచి తప్పుకుంటున్నట్లు గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ ప్రకటించడం టీడీపీకి పెద్ద నష్టం వాటిల్లనుంది. దీంతో నరసరావుపేట వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను టీడీపీలోకి తీసుకొచ్చి, గుంటూరు బరిలో దించే ఆలోచనలో టీడీపీ ఉంది. ఇప్పటికే విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ వైసీపీలో చేరడంతో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాబోయే రోజుల్లో టీడీపీ-జనసేన కూటమి టికెట్లను ఖరారు చేస్తే పెద్ద ఎత్తున అసంతృప్తులు ఎదురుకానున్నాయి. దీనిని గుర్తించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. బీజేపీతో పొత్తుపై స్పష్టత వచ్చాకే పూర్తిస్థాయిలో టీడీపీ, జనసేన కూటమి టికెట్లు ఖరారయ్యే అవకాశముంది.

భారతీయుల డేటాకు ముప్పు

- ఆన్‌లైన్‌లో అమ్మకానికి 75 కోట్ల మంది ఆధార్ వివరాలు
- 'సైబోడెవిల్, యూనిట్ 8200 పేరిట సేల్
- క్లౌడ్‌సెక్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: భారతీయుల వ్యక్తిగత సమాచారానికి రక్షణ కరువైంది. వివిధ కారణాలతో ప్రభుత్వంతో పాటు ఇతర వ్యవస్థల్లో ఆధార్ వివరాలు సేకరిస్తుంటారు. వాటిని వేర్వేరు డేటాబేస్‌లలో పొందుపరుస్తారు. కానీ ఆ డేటాబేస్‌లు పటిష్ఠంగా లేకపోవడం వల్ల ప్రజల వ్యక్తిగత సమాచారం డార్క్‌నెట్‌కు చేరుకుంటోంది. ప్రభుత్వ డేటాబేస్ లేక టెలీకమ్యూనికేషన్ వ్యవస్థల నుంచి డేటా హ్యాకర్లకు చిక్కుతోంది. దీంతో పౌరుల గోప్యత హక్కు, వ్యక్తిగత సమాచార భద్రతకు విఘాతం కలగడమే కాకుండా వారికి ముప్పు ఏర్పడుతోంది. ఈ సమాచారాన్ని దుర్వినియోగం చేసే ప్రమాదం పెరుగుతోంది. తాజాగా ఆధార్ గోప్యతపై మళ్లీ ఆందోళన నెలకొంది. 75 కోట్ల మంది భారతీయుల ఆధార్ వివరాలు, ఫోన్ నంబర్లు ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టడం సంచలనంగా మారింది. టెలీకమ్యూనికేషన్ వ్యవస్థలు లేక ప్రభుత్వ డేటాబేస్‌ల నుంచి ఈ సమాచారాన్ని తస్కరించి ఆన్‌లైన్‌లో అమ్ముకుంటున్నారని 'క్లౌడ్‌సెక్' సంస్థ తాజా నివేదిక వెల్లడించింది. 75 కోట్ల మంది ఆధార్, పేరు, ఫోన్ నంబర్, చిరునామా వంటి వ్యక్తిగత సమాచారం ఆన్‌లైన్‌లో విక్రయానికి ఉన్నట్లు పేర్కొంది. 'సైబోడెవిల్' పేరుతో ఈ విక్రయం జరుగుతున్నట్లు తమ డిజిటల్ ముప్పు రక్షణ వ్యవస్థ గుర్తించినట్లు కంపెనీ తెలిపింది. సమగ్ర మొబైల్ నెట్‌వర్క్ వినియోగదారుల డేటాబేస్ అమ్మకాన్ని ప్రోత్సహించేలా 'అండర్‌గ్రౌండ్ ఫోరం'లో 'సైబోడెవిల్' పోస్టు పెట్టినట్లు వెల్లడించింది. 'యూనిట్8200' పేరుతో టెలిగ్రామ్‌లోనూ ఈనెల 14న ఇదే తరహా పోస్టు ఉన్నట్లు క్లౌడ్‌సెక్ తెలిపింది. మొబైల్ వినియోగదారుడి పేరు, ఫోన్ నంబర్లు, చిరునామాలు, ఆధార్ వివరాలు, కుటుంబ సభ్యుల పేర్లు తదితర డేటా ఉన్నట్లు వెల్లడించింది. సైబోడెవిల్, యూనిట్8200 అనేవి సైబోక్రూ సంస్థలో భాగమని, ఇది 2023 జులైలో ఏర్పాటైందని క్లౌడ్‌సెక్ తెలిపింది. నెట్‌ఫ్లిక్స్ కో, జివామే, గివా కో, హుండయ్ లక్ష్యంగా డేటా చోరీకి సైబోక్రూ పాల్పడటంతో 21 లక్షల మందిపై ప్రభావం పడిందని సైబర్ సెక్యూరిటీ సంస్థ వెల్లడించింది. అండర్‌గ్రౌండ్ ఫోరం, టెలిగ్రామ్ పోస్టుల స్క్రీన్‌షాట్లను నివేదికలో పొందుపర్చింది. డేటాసెట్‌ను క్లౌడ్‌సెక్ స్వతంత్రంగా పరిశీలించిందా లేదా అన్నది పేర్కొనలేదు. పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని ఎలా సేకరించారని సైబోక్రూను ప్రశ్నిస్తే 'లా ఎన్‌ఫోర్స్‌మెంట్ మాధ్యమాలు బహిర్గతం చేయని అసెట్ వర్క్ ద్వారా డేటా పొందినట్లు వెల్లడించినట్లు నివేదిక తెలిపింది. ఈ అపారదర్శక సమాధానంతో అత్యంత సున్నిత సమాచారాన్ని పొందేందుకు వీరికి ఉన్న మార్గాలు, దాని చట్టబద్ధతను నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఏర్పడుతుంది. వీరు చెప్పినదాంట్లో నిజం ఎంత? ఇలాంటి డేటా పొందే పద్ధతులనూ పరిశీలించడం అత్యవసరం' అని నివేదిక పేర్కొంది. పౌరుల కీలక సమాచారం లీక్ కావడం వల్ల డేటా ఎక్స్‌ఫిల్ట్రేషన్‌తో పాటు డబ్బు కోసం దాడులు జరిగే ముప్పు ఉంటుందని హెచ్చరించింది. ఇదిలావుంటే 2018 జనవరి నుంచి 2023 అక్టోబరు వరకు భారతీయుల డేటా ఉల్లంఘనలు 165సార్లు జరిగినట్లు కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ గతేడాది డిసెంబరులో తెలిపారు. ఆధార్ డేటా లీక్ కాలేదన్నారు. కానీ 2018 జనవరిలో బిలియన్ మంది ఆధార్ కార్డుదారుల వివరాలు వాట్సాప్‌లో గుర్తుతెలియని వ్యక్తులు కొనుగోలు చేసినట్లు 'ది ట్రిబ్యూన్' వార్తాకథనం ప్రచురించింది. మరోవైపు ఎక్స్ (ట్విట్టర్), లింక్డ్‌ఇన్ వంటి ప్రముఖ వెబ్‌సైట్ల వినియోగదారుల వివరాలతో కూడిన దాదాపు 2,600 కోట్ల రికార్డులు లీకైనట్లు సెక్యూరిటీ డిస్కవరీ అండ్ సైబర్ న్యూస్ పరిశోధకులు గుర్తించారు. 12 టెరాబైట్ల డేటా లీకైందని, ఈ వివరాలతో ఆయా పౌరుల వ్యక్తిగత ఖాతాలను నేరగాళ్లు అనధికారికంగా వాడుకునే ప్రమాదం ఏర్పడిందని హెచ్చరించారు. సైబర్ దాడులు, మోసాల ముప్పు లేకపోలేదని చెప్పారు. చైనా మెసేజింగ్ దిగ్గజం టెన్సెంట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫాం వైబోతోపాటు అడోబ్, కాన్వా, టెలిగ్రామ్ వంటి వెబ్‌సైట్లను ఉపయోగించే వినియోగదారుల రికార్డులు లీకైనట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. 2019లో ఓ అన్‌సెక్యూర్డ్ వెబ్‌సైట్‌లో 100 కోట్ల రికార్డులు, 2013లో యాహూ వినియోగదారుల 300 రికార్డులు లీకైనట్లు సమాచారం.

తిరిగి ఎన్డీయేలోకి నితీశ్

(మొదటిపేజీ తరువాయి)

సోదరి రోహిణి ఆచార్య ట్వీట్లు చేశారు.

నితీశ్‌ది వెన్నుపోటు: సీపీఐ(ఎంఎల్)

నితీశ్ వెన్నుపోటు పొడిచారని మహాకూటమి ప్రభుత్వానికి బాహ్య మద్దతిచ్చిన సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య విమర్శించారు. ఫేస్‌బుక్ మాధ్యమంగా విమర్శలు గుప్పించారు. దీర్ఘకాల సీఎంగా గుర్తింపు పొందిన నితీశ్ ఇప్పుడు ఆర్ఎస్ఎస్-బీజేపీ కలిసి వాడుకునే పావుగా మారిపోయారని దుయ్యబట్టారు. 2020 ఆగస్టులో మోసం చేసిన జేడీ(యూ)ని మళ్లీ అక్కున చేర్చుకున్న బీజేపీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ విమర్శించారు.

నేనేమీ సంతోషంగా లేను: నితీశ్

తన రాజీనామాను సమర్పించిన తర్వాత నితీశ్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వ కాలం ముగిసిందని... దానిని వదిలేయాల్సి వచ్చింది' అని అన్నారు. మహాకూటమితో, ఇండియా కూటమితో తెగతెంపులతో తానేమీ ఆనందంగా లేనన్నారు. వాటి ఏర్పాటునకు ఎంతో శ్రమించానని చెబుతూ దానిని ఆ కూటములు గుర్తించలేదని నితీశ్ వ్యాఖ్యానించారు.

బీజేపీకి ఓటమి భయం

(మొదటిపేజీ తరువాయి)

క్రిమినల్ గవర్నమెంట్' అని విమర్శించారు. ఒక న్యాయనిపుణుడే కూడా క్రిమినల్ గవర్నమెంట్ అని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ముందే మోదీ ప్రభుత్వం అయోధ్య రామాలయాన్ని ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నదని, ఆలయం పూర్తికాకపోయినా ఆలయాన్ని ప్రారంభించారని విమర్శించారు. ఆలయ ప్రారంభం రోజు ఏమైనా జరగొచ్చని, అగ్నిగుండం బద్దలు కావొచ్చంటూ చాలా మందిని బీజేపీ నేతలు భయభ్రాంతులకు గురిచేశారని, చివరకు ఆ రాష్ట్ర సిపిఐ కార్యదర్శిని కూడా అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పినట్లు నారాయణ తెలిపారు. కేజ్రీవాల్‌తో పాటు జార్ఖండ్ సిఎంకు నోటీసులు జారీ చేశారని, ఒక్కో ఎమ్మెల్యేకి రూ.25 కోట్లు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధమవుతున్నదని, డబ్బులు, అధికారాన్ని ఉపయోగించి దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాముని పేరు చెప్పి ప్రజలను ఓటు అడగాలా?, లేదా పదేళ్ల కాలంలో చేపట్టిన కార్యక్రమాలను చూపి ఓటు అడగాలా? అని బీజేపీలో ఉన్న పెద్ద ప్రశ్న అని, బీజేపీ పదేళ్ల కాలంలో ప్రభుత్వరంగ సంస్థలను, నీటి పారుదల ప్రాజెక్టులు కొత్తగా తీసుకురాలేదని, పైగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేశారని విమర్శించారు. పార్లమెంట్‌ను ప్రధాని మోదీ ముద్దు పెట్టుకున్నప్పటి నుంచి పార్లమెంటరీ వ్యవస్థను ధ్వంసం చేస్తూ వస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు మోదీ ప్రతిజ్ఞ చేసినట్టుగా కనిపిస్తోందన్నారు.

వచ్చే లోక్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విశాల దృక్పథంతో ఉండాలని నారాయణ సూచించారు. దేశ వ్యాప్తంగా ఉన్న చిన్న, పెద్ద రాజకీయా పార్టీలను కలుపుకుని ముందుకు సాగాలని, అప్పుడే ప్రమాదకరమైన ప్రధాని మోదీని ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీపీఐతో సహా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని పోవడంతోనే మంచి ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. దీనిని దేశ వ్యాప్తంగా అనుసరించాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో వరంగల్, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, పెద్దపల్లి నియోజకవర్గాలపై చర్చించి జాబితా సిద్ధం చేశామని చెప్పారు. గత ప్రభుత్వంలో అన్యాయం జరిగినవారికి న్యాయం చేయాలని నారాయణ కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. సీపీఐ జాతీయ సమావేశాలకు పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు అమర్‌జీత్ కౌర్, వినయ్ విశ్వంతో పాటు జాతీయ నాయకులు హాజరుకానున్నట్లు నారాయణ తెలిపారు. దేశంలో రాజకీయాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో ఈ సమావేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయన్నారు. ఈ సమావేశంలో రానున్న ఎన్నికలలో అనుసరించాల్సిన విధానంపై స్పష్టమైన వైఖరి తీసుకుంటామన్నారు.

బీజేపీకి అనుకూలంగా జగన్, బాబు

ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబు బీజేపీకి అనుకూలంగా ఉన్నారని నారాయణ అన్నారు. జగన్ కోడి కత్తి, బాబుపైన 17ఎ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కేంద్రంలోని బీజేపీ న్యాయస్థానాల ద్వారా బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న ధైర్యం చంద్రబాబుకు లేదా , 17ఎ కేసు ఉంటే ఉందని ధైర్యంతో ఎందుకు నిలబడడం లేదని నారాయణ ప్రశ్నించారు.

సీఎం పదవి రాలేదనే కేటీఆర్ బాధ

బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన సచివాలయం తరహా భవనాలు కేసీఆర్ అనుభవించలేకపోయారని నారాయణ ఎద్దేవా చేశారు. ఆహంభావం, అసహనం పెరిగిందని, రాజకీయాల్లో అవినీతి అసహనం పెరిగితే మంచిది కాదని హితవు పలికారు. బీఆర్ఎస్ నేతలు అసంబద్ధంగా మాట్లాడుతున్నారని, ప్రభుత్వంపైన శాపనార్థాలు పెట్టడంతో వారి కుల్లుబుద్ధి భయటపడుతోందన్నారు. తానే ముఖ్యమంత్రి అవుతానని కేటీఆర్ అనుకున్నారని, సీఎం పదవి రాకపోయే సరికే ఆయన ఇబ్బంది పడుతున్నారని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. కోదండరామ్‌కు ఎమ్మెల్సీ రావడం పట్ల నారాయణ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఉపయోగపడేలా, అభివృద్ధి చేసే క్రమంలో వ్యాపారం చేస్తే తమకు అభ్యంతరం లేదని, రాష్ట్రాన్ని అమ్మే పద్ధతి పట్లనే తమకు అభ్యంతకరమని రాష్ట్రంలో అదాని పెట్టుబడులనుద్దేశించి ఒక ప్రశ్నకు నారాయణ సమాధానం చెప్పారు.

ఊసరవెల్లి ముదిరితే నితీశ్

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ అనేక ఎత్తులు వేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ మొదలైన సంస్థలు నితీశ్ మీద ఎన్నడూ దాడి చేయలేదు. దీనికి కారణం ఆయన నిఖార్సైన వ్యక్తిత్వమే. అందువల్ల ఇప్పుడు దీర్ఘ కాలిక దృష్టితో బీజేపీని ఆయనను చేరదీస్తుంది. రేపటి నుంచి ఆయన కేంద్ర బీజేపీ నాయకుల ఆదేశాలను పాటిస్తూ, వారి అడుగులకు మడుగులొత్తుతూ పని చేయక తప్పదు. అంటే తన స్వేచ్ఛనూ వదులుకోగలిగిన నిస్వార్థపరుణ్ని అని నిరూపించదలచుకున్నట్టున్నారు. ఆర్‌జేడీని లొంగదీయడం బీజేపీకి సాధ్యం కాలేదు. ఇప్పటిదాకా ఆర్‌జేడీ ఒక్క పార్టీ మాత్రమే బీజేపీతో పొత్తు పెట్టుకోకుండా జాగ్రత్త పడింది. తమది సెక్యులర్ పార్టీ అని నిరూపించుకుంది. లాలూను జైలుకు పంపినా, ఆయన కుమార్తె, కుమారుడు తేజస్వీ యాదవ్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎంతగా వేధిస్తున్నా ఆర్‌జేడీ లొంగలేదు. నితీశ్ చేయదలుచుకున్న పనులను బీజేపీ ఎటూ చేయనివ్వదు. మొన్నటి దాకా బీజేపీ దృష్టిలో నితీశ్ విలన్. ఇప్పుడు హీరో. నితీశ్ కుమార్, లల్లన్ సింగ్‌కు బీజేపీ తలుపులు శాశ్వతంగా మూసుకుపోయాయని అమిత్ షా హుంకరించారు. మరి ఇప్పుడు నితీశ్‌కు బీజేపీ ద్వారాలు తెరుస్తోందంటే అసలు పల్టూ పార్టీ బీజేపీయే అవుతుంది. ప్రాణమైన వదులుతాను కాని మళ్లీ బీజేపీతో పొత్తు కూడను అని భీష్మ ప్రతిజ్ఞ చేసిన నితీశ్ అదే పొరపాటు చేస్తున్నారంటే తన ఆత్మను త్యాగం చేయడానికి సిద్ధపడ్డట్టే. బీజేపీకి నితీశ్ అవసరం ఏర్పడడానికీ కారణం ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికలలో జేడీయూతో పొత్తు ఉన్నందునే బీజేపీ లాభపడింది. బీహార్ ప్రజలు మోదీ ముఖం చూసి ఓటు వేయరు. నితీశ్ ముఖం చూసే వేస్తారు. 2025 శాసనసభ ఎన్నికలలో, 2025 శాసనసభ ఎన్నికలలో పల్టూ రాంగా పేరుపడ్డ నితీశ్‌కు నష్టమే మిగులుతుంది. శాసనసభను రద్దు చేద్దామన్న నితీశ్ ప్రతిపాదనను ఆర్‌జేడీ ఒప్పుకోలేదు. ఇప్పటికైతే ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆర్‌జేడీ ప్రయత్నిస్తున్న దాఖలాలూ లేవు. ఏమైతేనేం స్వయంగా భస్మాసురుడి దగ్గరకెళ్లి నితీశ్ చేయి పెట్టించుకుంటున్నారు.

బడ్జెట్ సమావేశాలు?

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత ఏర్పడే కొత్త ప్రభుత్వం మళ్లీ పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఏర్పాటు చేస్తుంది. వైసీపీ ప్రభుత్వానికి ఇది చివరి బడ్జెట్ సమావేశాలు కావడంతో దానికి సంబంధించిన కసరత్తు పూర్తయింది. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అధ్వర్యంలో బడ్జెట్ అంచనాలను సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయా శాఖల నుంచి అంచనాలను ఆర్థిక శాఖ తెప్పించుకుంది. ప్రధానంగా వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను కేటాయిస్తారు. బడ్జెట్ సమావేశాల నిర్వహణంతో అసెంబ్లీ, సచివాలయం పరిసర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాట్లకు ప్రభుత్వం నిమగ్నమైంది.

ఆక్వా రంగం కుదేలు

(మొదటిపేజీ తరువాయి)

అమలుపరిచారా అంటే అదీ లేదు. అదే మూస పద్ధతి, మళ్లీ నష్టాలు, డిమాండ్ కు తగ్గట్టుగా నాణ్యమైన రొయ్య పిల్లలను సరఫరా చేసే పరిస్థితి లేకపోవడంతో రైతుల్లోనే కొంతమంది హేచరీలు ప్రారంభించారు. వాటి ద్వారా కోట్లను గడించారు. రైతులకు మాత్రం ఇప్పటివరకు నాణ్యమైన సీడ్ అందుబాటులోకి రావడం లేదు. తల్లి రొయ్య నాణ్యత లేకపోతుండడంతో పిల్ల రొయ్య కూడా అదే విధంగా ఉంటూ వినియోగిస్తున్న రొయ్య రైతుల పాలిట శాపంగా మారుతోంది. ఆక్వా సేద్యం ప్రారంభమైన తొలినాళ్లలో తక్కువ ధరలకే నాణ్యమైన ఫీడ్ లభించేది. అయితే డిమాండ్ పెరగడంతో ఈ విభాగంలో చిన్న చిన్న కంపెనీలు కూడా ఉత్పత్తులు ప్రారంభించాయి. రైతులు కూడా రకరకాల సలహాలతో ఇంటివద్దనే వివిధ రకాల ఫీడ్ లను తయారు చేయడం, వినియోగించడం జరిగింది. కాలక్రమేణా ఫీడ్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి తోడు వైరస్ ల బెడద పట్టి పీడించింది. వ్యాధులు రాకుండా ఉండేందుకు రసాయనం వాడాలి. ఫలానా రసాయనం వాడాలంటూ కొంతమంది టెక్నీషియన్ల అవతారం ఎత్తారు. నేడు రొయ్య రైతులు వినియోగించే ఒక్కో రసాయనం అర లీటర్ రూ.1500 వరకు ఉంది. సేద్యంపై అదుపు కోల్పోయి యాంటీబయోటిక్స్ వినియోగించడం ఎగుమతుల పాలిట శాపంగా మారుతోంది. టన్నుల కొద్దీ రొయ్యలు పండించే రైతుల కన్నా ఆక్వా రంగంలో వ్యాపారులు, దళారులు మాత్రమే బాగుపడుతున్నారు. మంచి ధర ఉన్న సమయంలో రైతులు పంట సాగుకు శ్రీకారం చుడతారు... ఉత్పత్తి చేతికొచ్చే సమయంలో ఉన్నట్లుండి ధర తగ్గించి... రైతుల పొట్ట కొట్టి లాభాలు దండుకోవడం వ్యాపారులకు పరిపాటిగా మారిపోయింది. ఓవైపు తెగుళ్ల కారణంగా పైకి తేలుతున్న రొయ్యలు అమ్ముకోకపోతే కుళ్లిపోయే పరిస్థితి దాపురిస్తుంది. దళారులు చెప్పినంత రేటుకే తెగ నమ్ముకోవాల్సిన దుస్థితిలో ఉన్న ఆక్వా రైతులకు విపరీతంగా నష్టాలు వస్తున్నాయి. ముఖ్యంగా విరామం లేకుండా ఆక్వా సాగు చేయడం కూడా ఈ రంగం దుస్థితికి కారణంగా ఉంది. సముద్రంలో మత్స్య సంపద పెరిగేందుకు కారణమైన ప్రత్యుత్పత్తి జరిగే సమయంలో ప్రభుత్వం నిషేధం విధిస్తుంది. అదేవిధంగా జలాశయాల్లోనూ నిషేధం విధిస్తారు. సంవత్సరంలో ఉన్న 12 నెలలలో ఏ నెలలో ఆక్వా సాగుకు అత్యంత అనుకూలమైన విషయమో గుర్తించి మిగిలిన నెలలలో ప్రభుత్వమే ఈ సాగును నిషేధించి పటిష్ఠంగా అమలు చేస్తే కొంత ఫలితం ఉండవచ్చునని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. తామే సొంతంగా క్రాప్ హాలిడే పాటిస్తూ నిర్ణీత సమయంలోనే సాగు చేపడుతున్న రైతుల్లో ఇప్పటికీ విజయ శాతం ఎక్కువగా ఉండడం గమనార్హం.

అధికారం కోసం జగన్ ఆరాటం

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు/పత్తికొండ: అబద్ధాలతో ప్రజలను నమ్మించి మరోసారి అధికారంలోకి రావాలని సీఎం జగన్ ఆరాట పడుతున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలందరూ బాధితులేనన్నారు. నెల్లూరు, కర్నూలుజిల్లా పత్తికొండలో నిర్వహించిన 'రా... కదలిరా' బహిరంగ సభలో చంద్రబాబు ఆదివారం ప్రసంగించారు. జగన్ పాలనలో ప్రజల జీవితాల్లో మార్పు రాలేదని, ఎంపీ గల్లా జయదేవ్‌కు చెందిన అమరరాజా బ్యాటరీస్ పరిశ్రమను రాష్ట్రం నుంచి వెళ్లిపోయేలా చేశారని, ఆయన కుటుంబం రాజకీయాలు వద్దనే పరిస్థితికి తెచ్చారని చంద్రబాబు విమర్శించారు. తనకు కష్టం వస్తే వివిధ రాష్ట్రాలతోపాటు 80 దేశాల్లో ప్రజలు మద్దతు తెలిపారని చెప్పారు. రాష్ట్రం కోసం తాను చేసిన అభివృద్ధిని వివరించారు. ఒక నాయకుడికి ఇంతకంటే ఇంకేం కావాలన్నారు. తెలుగుజాతిని ప్రపంచంలో నెంబర్‌వన్ చేసే బాధ్యత తీసుకుంటానని, జగన్ ఇచ్చే టికెట్లు వద్దంటూ నాయకులు పారిపోతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కదలిరావాలని వైసీపీ నాయకులకు పిలుపునిస్తున్నానని చంద్రబాబు అన్నారు. రైతులు ఎక్కువగా అప్పులు చేసిన రాష్ట్రాల్లో ఏపీ ముందుందని, ఆత్మహత్యల్లో అగ్రస్థానంలో ఉందని చంద్రబాబు గుర్తుచేశారు. ఆక్వా రంగాన్ని బాగు చేస్తానని, జగన్ అర్జునుడు కాదు.. భస్మాసురుడని చంద్రబాబు విమర్శించారు. ఆయన్ను ఎన్నుకున్న ప్రజల తలమీదే చెయ్యివేసి.. అభివృద్ధిని పాతాళంలోకి నెట్టేశారన్నారు. దేశంలో అందరు సీఎంల కంటే జగన్ వద్దే ఆస్తులు ఎక్కువ ఉన్నాయన్నారు. టీడీపీ వచ్చాక ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగం లేకపోతే నిరుద్యోగులకు రూ.3 వేల భృతి చెల్లిస్తామన్నారు. స్థానిక సంస్థలకు ఇచ్చే నిధులు నిలిపేశారని, టీడీపీ అధికారంలోకి వచ్చాక వాటికి అధికారం ఇచ్చి గౌరవిస్తామన్నారు. మద్యం పేరుతో పేదల రక్తాన్ని జగన్ సర్కారు తాగుతోందన్నారు. మద్యపాన నిషేధంపై జగన్ మాటతప్పారని ఆరోపించారు. త్వరలోనే ప్రజలు ఫ్యాన్ రెక్కలు విరిచి పక్కన పెడతారన్నారు.

జగన్ పతనం ప్రారంభమైందని, దానిని ఎవరూ కాపాడలేరని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలోని ప్రతి బాధితుడు ఓ స్టార్ క్యాంపెయినరేనని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఐదు కోట్ల మంది ప్రజలు స్టార్ క్యాంపెయినర్లుగా మారాలని పిలుపునిచ్చారు. వైసీపీని భూస్థాపితం చేస్తామని ప్రజలు శపథం చేయాలన్నారు. పేదలకు సేవ చేస్తే ఆ పార్టీలో పదవులివ్వరని, బూతుల రత్నకు ఎమ్మెల్యే, బూతుల సామ్రాట్‌కు ఎంపీ, బూతుల నటసామ్రాట్‌కు మంత్రి పదవులిస్తారని ఎద్దేవా చేశారు. మాజీమంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నారాయణ, శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, మాజీ శాసనసభ్యులు రామారావు, పాశం సునీల్ కుమార్, విజయరామిరెడ్డి, టి.రమేశ్‌రెడ్డి, తాళ్లపాక అను రాధ, నాయకులు కోటంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, చంచలబాబు యాదవ్, సుబ్బనాయుడు, కావ్య కృష్ణారెడ్డి, జనసేన పార్టీ నాయకులు మనుక్రాంత్‌రెడ్డి, సుజయ్, కిషోర్, పెద్దఎత్తున తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ విద్య, వైద్యం అందించాలి: జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ: నేటి సమాజంలో విద్య, వైద్యం అంగడి వస్తువులుగా మారాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్ విమర్శించారు. విద్య, వైద్యం ప్రజలు అందరికీ అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతనంగా ప్రారంభమైన గ్యాస్ట్రో, లివర్, చిన్నపిల్లల వైద్యశాల సహకారంతో సీపీఐ విజయవాడ 7వ డివిజన్ శాఖ అధ్వర్యంలో స్థానిక బందెలదొడ్డి సెంటర్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జల్లి విల్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యుడు అప్పురబోతు రాము అధ్యక్షతన జరిగిన సభలో జల్లి విల్సన్ మాట్లాడుతూ ఆరోగ్యం కాపాడుకోవటానికి పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉచిత విద్య, వైద్యం అందరి హక్కు అన్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా అవసరార్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్పొరేట్ వైద్యం ఖరీదుతో కూడుకున్నదని, దానిని పొందే తాహత్తు లేని పేదలకు వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని జల్లి విల్సన్ అన్నారు. అనంతరం పిల్లల వైద్య నిపుణులు చలసాని అనూష, కాలేయ వైద్యులు చింతా వీర అభినవ్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పులకు అనుగుణంగా వచ్చే వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తొమ్మిది నెలలు నిండకుండానే పుట్టే పిల్లల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలని తల్లులకు సూచించారు. అధిక రక్తపోటు, మధుమేహం, కాలేయం వ్యాధులు... కాలానుగుణంగా వచ్చే శారీరక రుగ్మతలకు పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులను వైద్యులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు చలసాని అజయ్ కుమార్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు నాగమోతు రాజా, టీడీపీ నేత గుమ్మడి గురుప్రసాద్, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శివర్గ సభ్యులు మూలి సాంబశివరావు, తాడి పైడయ్య, 7వ డివిజన్ కార్యదర్శి పూసర్ల లక్ష్మణ రావు, స్థానిక నాయకులు పందిరి నూకరాజు, బద్దా మాణిక్యం, బర్రె సత్యవతి, కొల్లి రమణ, కాళ్ల అప్పలరాజు, పి.భాను పాల్గొన్నారు.

పిఠాపురం జగ్గయ్య చెరువులో

కబ్జాలు అడ్డుకున్న సీపీఐ, ఏఐటీయూసీ

విశాలాంధ్ర-పిఠాపురం : తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలోని జగ్గయ్య చెరువులో 257 సర్వే నంబరు భూమిని అధికార పార్టీ నాయకుల కబ్జా యత్నాన్ని సీపీఐ, ఏఐటీయూసీ శ్రేణులు అడ్డు కున్నాయి. 84 సెంట్లు స్థలాన్ని కబ్జా చేసేందుకు రాత్రికి రాత్రే జేసీబీలతో తుప్పలు తొలగించే ప్రయత్నం చేస్తుండగా సీపీఐ శ్రేణులు అందించిన సమాచారం మేరకు అధికారులు స్థలం దగ్గర చేరుకుని జేసీబీని అడ్డుకున్నారు. ఆదివారం ఉదయం కబ్జా జరిగిన స్థలానికి సీపీఐ, ఏఐటీయూసీ నాయకుడు మునిసిపల్ కార్మికులతో వెళ్లి, కార్మికులకు ఆ స్థలంలో కాలనీ ఏర్పాటు చేయాలని ఎర్ర జెండాలు పాతారు. ఈ సంద ర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ ఖాళీ స్థలం ఉన్నా అధికార పార్టీ వారు దౌర్జన్యం చేసి కబ్జాలకు పాల్పడుతున్నారని, దీనికి అధికారులు అండగా ఉంటున్నారని తెలిపారు. అందులో భాగంగానే జగ్గయ్య చెరువులో దొంగ పట్టాలు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజలకు సేవ చేయవలసిన అధికార పార్టీ

నాయకులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని, అలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగ్గయ్య చెరువులో ఒక్కొక్క పేరును 20 పట్టాలు మంజూరై ఉన్నాయని, ఎప్పుడో పిఠాపురం నుంచి పోయిన రెవెన్యూ అధికారుల పేరుతో అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ఆ పట్టాల పంపిణీని రద్దు చేసి, కబ్జాకు గురవుతున్న స్థలాన్ని పరిరక్షించి, కార్మికులకు ఇళ్ల స్థలాలుగా ప్రకటించాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో సంబంధిత కార్యాలయం దగ్గర పోరాటం చేస్తామని ఈ సందర్భంగా సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల అప్పారావు, పొట్లూరి అమ్ములు, బంగారు కన్నయ్య, చెక్క అప్పలకొండ, ఎర్రంశెట్టి పద్మ, గూడుపు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మా ప్రతిపాదనలు మేనిఫెస్టోలో చేర్చి అమలు చేయాలి: ఏపీటీఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే సార్వత్రిక ఎన్నికలలో రాజకీయ పార్టీలు రూపొందించే మేనిఫెస్టోలో తాము ప్రతిపాదించిన అంశాలను చేర్చి అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) తెలిపింది. ఈ మేరకు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మా ప్రతిపాదనలు ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సంక్షేమంతో పాటు ప్రజల సంక్షేమానికి కూడా తోడ్పడతాయని పేర్కొన్నారు. సీపీఎస్/జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

పేద బిడ్డలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యా విధానం పేరుతో జీవో నంబరు 117 తీసుకొచ్చి 3,4,5 తరగతులను దూరంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల డ్రాపౌట్స్ పెరిగి ప్రాథమిక విద్యా వ్యవస్థ బాగా దెబ్బతిన్నదని వివరించారు. అంతేకాకుండా బోధనేతర కార్యక్రమాలతో పేద బిడ్డలకు నాణ్యమైన విద్య దూరమైందని, ఈ విధానాన్ని మార్చి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని సూచించారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాంతర మాధ్యమాన్ని కొనసాగించాలని, డీఎస్సీ నిర్వహించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసి, నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఉద్యోగుల డీఏలను సకాలంలో మంజూరు చేయాలని, ఆ దిశగా రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చి అమలు చేసేందుకు కృషి చేయాలని కోరారు.

ఏపీలో 21 మంది ఐఏఎస్‌ల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో 21 మంది ఐఏఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఐఏఎస్‌ల వివరాలిలా ఉన్నాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ బాలాజీరావును నియమించారు. నంద్యాల కలెక్టర్‌గా మంజీర్ జిలానీ, తిరుపతి కలెక్టర్‌గా లక్ష్మీషా బదిలీ అయ్యారు. హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా తిరుపతి కలెక్టర్ వెంకట్ రమణారెడ్డిని, నంద్యాల కలెక్టర్‌గా ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టరు శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా అభిషిక్త్ కిశోర్, శ్రీకాకుళం జిల్లా మున్సిపల్ కమిషనర్‌గా తమీమ్ అన్సారీయాను బదిలీ చేశారు. పార్వతీపురం జాయింట్ కలెక్టర్‌గా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా రోనంకి కూర్మనాథ్, విశాఖ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా కె.ఎస్.విశ్వనాథం, విశాఖ జాయింట్ కలెక్టర్‌గా మయూర్ అశోక్‌ను నియమించారు. ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా గోపాలకృష్ణ రోనంకి, కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా ప్రవీణ్ ఆదిత్య, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా అలేఖ్య, సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్స్ అడిషనల్ డైరెక్టర్‌గా గోవిందరావు, విజయనగరం జాయింట్ కలెక్టర్‌గా కార్తీక్, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా భావన, ఏపీయూఎఫ్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా హరిత, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా రేఖారాణి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా అదితి సింగ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది.

బీసీ కుల గణనను వ్యతిరేకిస్తే చరిత్ర హీనులే

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు మారేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్‌లో మహాయజ్ఞంలాగా కులగణన ప్రక్రియ కొనసాగుతోందని, దీనిని వ్యతిరేకించిన వాళ్లంతా చరిత్ర హీనులవుతారని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఎన్.మారేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, బీసీలందరూ ఒక సువర్ణ అవకాశంగా భావించి తప్పనిసరిగా తమ కులాల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న 139 బీసీ కులాలు కులగణనలో భాగస్వామ్యం కావాలన్నారు. దాదాపు 92 ఏళ్ల తర్వాత సీఎం జగన్ దూరదృష్టితో కులగణన ప్రక్రియ ప్రారంభమవడం చారిత్రాత్మక ఘట్టమని తెలిపారు. గత ప్రభుత్వాలు బీసీల లెక్కలు తీయడానికి భయపడితే, నేటి సీఎం జగన్ బీసీల పక్షపాతిగా నిలిచారన్నారు. బీసీలకు రాజ్యాధికారంలో రాష్ట్ర సంపదలో వాటా ఇవ్వాలన్న మంచి ఉద్దేశంతోనే కుల గణన ప్రక్రియను ప్రారంభించారని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలు ప్రశంసించిన సచివాలయ, వలంటరీ వ్యవస్థల ద్వారా పూర్తి పారదర్శకత చిత్తశుద్ధితో కులగణన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని తరహాగా ఒక్క ఆంధ్ర ప్రదేశ్‌లోనే బీసీలకు సంక్షేమ పథకాలను సీఎం జగన్ ప్రభుత్వం అందిస్తోందని కొనియాడారు. బీసీలు ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రాల్లోనూ బీసీలకు ఈ తరహాగా సంక్షేమ పథకాలు లేవని ఆయన స్పష్టం చేశారు.

హమాలీలకు హెడ్ లోడ్ చట్టం అమలు చేయాలి

ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో హమాలీ ముఠా కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం హెడ్‌లోడ్ చట్టాన్ని అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ బజార్ హమాలీ ముఠా జట్టు కళాసీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం విజయవాడ దాసరిభవన్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూలి సాంబశివ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జి. ఓబులేసు మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమైన హమాలీరంగంలో లక్షలాది మంది నిరంతరం రెక్కలు ముక్కలు చేసుకుని పని చేస్తేనే ప్రజలకు సరుకులు ఇళ్లకు చేరుతాయన్నారు. అలాంటి కార్మికులకు ఎలాంటి చట్టాలు లేకుండా ఏళ్ల తరబడి పని చేస్తున్నారని చెప్పారు. దేశంలో 53 కోట్ల మంది అసంఘటిత రంగా కార్మికులు ఉంటే వారి సంక్షేమానికి పాల కులు ఏమాత్రం చర్యలు తీసుకోవటం లేదన్నారు. అరకొరగా ఉన్న చట్టాలను కూడా సక్రమంగా అమలు చేయకుండా వాటిని నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఇందుకు ఉదాహరణగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసి అందులోని కార్మికుల సొమ్మును 29 వేల కోట్లు దారి మళ్లించాయని

తెలిపారు. రాష్ట్రం లో సీఎం జగన్ మోహన్ రెడ్డి కూడా అంబేద్కర్ విగ్రహం పెట్టి దళితులకు చాలా చేసినట్లు చెబుతూ వారి ఓట్లు దండుకోవడానికి ప్లాన్ చేస్తు న్నాడన్నారు. ఇటువంటి పాలకుల విధానాలు త్రిప్పి కొట్టాలని అందుకు కార్మిక వర్గం ముందు వరసలో ఉండాలన్నారు. ముఖ్యంగా కష్టజీవులైన హమాలీలు పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు.

హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రంలో హెడ్‌లోడ్ యాక్ట్ అమలు చేస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో 25 లక్షల మంది ముఠా కార్మికులు నిరంతరం పనిచేస్తున్నారని చెప్పారు. వ్యాపారరంగంలో కార్పొరేట్ కంపెనీల వల్ల కొత్త కొత్త మాల్స్ రావటంతో లోడింగ్ అన్‌లోడింగ్ కార్మికుల పని భద్రతకు నష్టం కలుగుతుందన్నారు. పోటీ ప్రపంచం వల్ల వ్యాపారంలో హమాలీ కార్మికులు సరైన వేతనాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. హెడ్ లోడు చట్టం కోసం ఫిబ్రవరి 12వ తేదీన అన్ని పట్టణ కేంద్రాల్లో హమాలీ ముఠా జట్టు కళాసి కార్మికులు ర్యాలీలు నిర్వహించి కలెక్టర్లకు వినతిపత్రం ఇవ్వాలన్నారు. ఫిబ్రవరి 15వ తేదీన 175 మంది ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వాలన్నారు. ఫిబ్రవరి 26వ తేదీ అధికార ప్రతిపక్ష పార్టీలకు ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీ ముఠా కార్మికుల గురించి పొందు పరచాలని కోరాలని సూచించారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం. మన్మధరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్‌డీ రవి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.అంజిబాబు ఏఐటీయూసీ విజయవాడ నగర అధ్యక్షులు కేఆర్ ఆంజనేయులు, నగర ముఠా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వి. నాగేశ్వరరావు, నాయకులు గుంతకల్ మహేశ్, నూజివీడు శ్రీను, వస్త్రలత పెద్ద మేస్త్రి చీపిళ్ల సత్యనారాయణ, ముఠామేస్త్రిలు పాల్గొన్నారు.

మోదీ ఆంధ్రా కేడీ

- ప్రత్యేక హోదా హామీ గాలికి
- నేను వైఎస్ బిడ్డనే
- అన్నింటికీ సిద్ధంగా ఉన్నా
- కార్యకర్తల సమావేశంలో షర్మిల

విశాలాంధ్ర- తిరుపతి: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ ప్రజల వద్ద కేడీ గా మిగిలిపోతారని, బీజేపీకి మద్దతు పలుకుతున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా కేడీయేనని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం తిరుపతి లో ఏర్పాటు చేసిన తిరుపతి, చిత్తూరు జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ...ప్రధాని నరేంద్ర మోదీ ఆనాడు తిరుపతి లో వెంకన్న సాక్షిగా ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని దుయ్యబట్టారు. అయోధ్య పై భక్తి చూపించిన విధంగా వెంకన్న సాక్షి గా ఇచ్చిన హామీ పై చిత్త శుద్ధి లేదా అని ప్రశ్నించారు. ఆనాడు తిరుపతి లో మునికోటి అనే వ్యక్తి ప్రత్యేక హోదా కోసం ఆత్మహత్య చేసుకున్నాడన్నారు.బీజేపీ మతతత్వ పార్టీ అని,అందులో కేడీ లు ఎక్కువగా ఉన్నారన్నారు. ఏపీకి రాజధాని లేదు...పోలవరం ప్రాజెక్టు పనులు జరగలేదన్నారు. అలాగే ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ఏ ఒక్క ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. వైఎస్ఆర్ పాలన-జగనన్న పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు 90 శాతం వైఎస్ రాజశేఖరరెడ్డి పూర్తి చేస్తే తర్వాత వచ్చిన జగనన్న 10 శాతం కూడా చెయ్యలేక పోయారని ఎద్దేవా చేశారు. గాలేరు నగరి ప్రాజెక్టు 50 శాతం పనులు రాజశేఖర్ రెడ్డి పూర్తి చేస్తే మిగిలిన పనులు ఇప్పటి వరకు ప్రారంభించడానికి నోచుకోలేదన్నారు. మొత్తం గా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీని దోచేశారని విరుచుకుపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి మోదీ దగ్గర ఊడిగం చేస్తున్నారని... చెప్పిన ప్రతి మాట తప్పుతున్నారని విమర్శించారు. మహిళలకిచ్చిన మద్యపాన నిషేధం హామీ నెరవేర్చలేదన్నారు. తనలో వైఎస్సార్ రక్తం ప్రవహిస్తోందని...పుట్టింటికి వచ్చి రాజకీయం చేస్తున్నానని... నాపై దాడులు చేసినా, కించపరిచినా ఎవరికీ భయపడమని అన్నారు. అనంతరం మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ మాట్లాడుతూ... షర్మిల కు ఉన్న సమయస్ఫూర్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కి కూడా లేదన్నారు. ఈ ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి పాలన లో దళితులు సర్వం కోల్పోయారని తెలిపారు. దళితులకు ఉద్యోగాలు లేవు, విద్యావ్యవస్థ ను సర్వనాశనం చేశారన్నారు. రాష్ట్రంలో దళిత వ్యతిరేక ముఖ్యమంత్రిగా జగన్ మిగిలిపోయారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లంరాజు, జేడీ శీలం, రఘువీరారెడ్డి, శాంతమ్మ, వేణుగోపాల్ రెడ్డి , రాం భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు పులివెందులలోనూ ఓటమి తప్పదు

గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి పులివెందులలో కూడా ఓటమి తప్పదని మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'భీమిలి సిద్ధం సభ'లో జగన్ అన్ని అబద్ధాలే మాట్లాడారని చెప్పారు. తనకు తాను అర్జునుడిగా జగన్ చెప్పుకుంటున్నారని, ఆ వ్యాఖ్యలపై జనం నవ్వుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని గంటా శ్రీనివాస రావు చెప్పారు. వై నాట్ 175 అని సీఎం జగన్ అంటున్నారని, పులివెందులలో ఆయన ఓడిపోతున్నారని గంటా శ్రీనివాస రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల సమయంలో జగన్ 'నవ రత్నాలతో కలిపి 730 హామీలు ఇచ్చారు. 15 శాతం హామీలే అమలు చేశారని, జగన్ ఎప్పుడూ తాము పాండవులం అంటారని, నిజానికి వారు కౌరవులన్నారు. ప్రజా వేదిక కూల్చి పాలన ప్రారంభించారని, ఆయన పాలన అంతా విధ్వంసం, ప్రత్యర్థులు అణిచివేత కోసం కొనసాగాయన్నారు. 2019 ఎన్నికల్లో విజయానికి కృషి చేసిన చెల్లి, తల్లిని బయటకు పంపేశారని, ఎన్నికల ముందు కోడి కత్తి డ్రామా ఆడారని, షర్మిల ఆరోపణలపై వైసీపీ ఎందుకు మాట్లాడటం లేదన్నారు. వైసీపీ అంటే నకిలీ పార్టీ, ముగ్గురు రెడ్లు నడుపుతున్నారని, జగన్ ఎప్పుడూ వై నాట్ 175 అంటారు. పులివెందులలో కూడా జగన్ ఓడిపోతారన్నారు. అమరావతిని శ్మశానంగా మార్చారని, విశాఖపట్టణాన్ని ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ అన్నారు, న్యాయ రాజధాని సంగతి ఎంత వరకు వచ్చిందన్నారు. 100 అడుగులు పాతాళంలోకి వైసీపీని పాతి పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదన్నారు. ఆ పార్టీ మునిగిపోతున్న నావ అందుకే ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీ వీడుతున్నా రన్నారు. జగన్ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభం అయ్యిందన్నారు. విలువలు పాటించకుండా నా రాజీనామా ఆమోదించారని, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మ శ్రీ రాజీనామాను ఎందుకు ఆమోదించలేదన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఓడిపోతామని వైసీపీకి తెలిసిపోయిందని, అందుకే కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్న రాజీనామాను ఆమోదిం చారు అని గంటా శ్రీనివాస రావు మండిపడ్డారు.

టీటీడీ యాజమాన్యాన్ని దేవుడు కూడా క్షమించడు

కూనంనేని సాంబశివరావు

విశాలాంధ్ర- తిరుపతి: టీటీడీ యాజమాన్యాన్ని, పాలక మండలిని దేవుడు కూడా క్షమించడని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రెండవ రోజు నిరవధిక దీక్షలో ఉన్న కందారపు మురళి , టీటీడీ అటవీ కార్మికులను ఆదివారం ఆయన పరామర్శించారు ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ, 1159 రోజులుగా టీటీడీ అటవీ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే టీటీడీ యాజమాన్యం ఏం చేసున్నదని ప్రశ్నించారు కరుణాకర్ రెడ్డి లాంటి వ్యక్తి టీటీడీ చైర్మన్‌గా ఉన్నా ఆమరణ నిరాహార దీక్షలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందంటే పరిస్థితి ఏమిటో అర్థం అవుతుందని, తక్షణం ఈ సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. జూనియర్లను పర్మినెంట్ చేసి, సీనియర్లను వీధుల పాల్జేయటం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి. మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ సీపీఎం జిల్లా కార్యదర్శి వనవాసి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఫారెస్ట్ కార్మికుల సమస్యపై ఉయ్యాల పాటతో నాగరాజు అలరించారు. నిరవధిక దీక్షలకు మద్దతుగా విచ్చేసిన అంగన్వాడీ యూనియన్ నేత నాగరాజమ్మ అంగన్వాడీ మహిళలు కోలాటాన్ని గొబ్బెమ్మ పాటలను దీక్షా శిబిరం ఎదుట ప్రదర్శించారు.

నేడు సీఎంతో నెల్లూరు జిల్లా నేతల భేటీ

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సోమవారం నెల్లూరుజిల్లా వైసీపీ నేతలు భేటీ కానున్నారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పీ అనిల్‌కుమార్ యాదవ్‌ను నరసరావుపేట ఎంపీగా పోటీకి అధిష్టానం ప్రతిపాదించడంతో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. నరసరావుపేటకు అనిల్‌కుమార్ యాదవ్ వెళ్తే... దీంతో నెల్లూరు సిటీ వైసీపీ ఎమ్మెల్యేగా ఎవరిని నియమించాలన్న దానిపై స్పష్టత రానుంది. ఈ మేరకు నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ, పార్టీ ముఖ్యనేతలు సీఎం జగన్‌ను కలవనున్నారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ప్రస్తుతం నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వైసీపీ నిర్ణయించింది. ఇదే సమయలో ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి సీట్లు ఇవ్వడంపై మిగిలిన వైసీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అనిల్‌కుమార్ మాత్రం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని ప్రతిపాదిస్తున్నారు. ఇదే నెల్లూరు సిటీ టికెట్ కోసం రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు సుధీర్‌కుమార్‌రెడ్డి, వైసీపీ నేత పెంచలరెడ్డి ఆశిస్తున్నారు. సీఎం జగన్‌తో జరగబోయే సమావేశంలో నరసరావుపేట, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిపై స్పష్టత రానుంది.

సాహితి

పర్యావరణం కోసం పరితపించే కవిత్వం

మనిషికి నిరంతరం పచ్చదనం అనే ఆరోగ్య సంపదనిస్తూ అతనికి కొండంత అండగా వుంటుంది పర్యావరణం. కానీ ఇప్పుడు మనిషి తననిండా నింపుకుంటున్న అంతులేని అత్యాశలతో, స్వార్థంతో దానికి నిర్లక్ష్యపు పొరల్ని కప్పేస్తున్నాడు. అతని అత్యాశలు పచ్చదనాన్నీ, ప్రకృతి సోయగాల్నీ మటుమాయం చేసేస్తూ తెచ్చిపెట్టుకున్న దుఃఖాలకు ఆజ్యం పోస్తున్నాయి. ప్రపంచం పర్యావరణాన్ని క్రమంగా కోల్పోతూ ప్రకృతి వైపరీత్యాలతో అతలాకుతలమైపోతోంది. క్రమంగా నిండిపోతున్న కాలుష్యభూతాలు మనిషి జీవన సంఘర్షణకు ఆజ్యం పోస్తున్నాయి. సముద్రాలు చిన్నబోతున్నాయి. పచ్చదనంతో బాటు మనిషిలోని స్వచ్ఛదనమూ కుచించుకుపోతోంది. కిలకిలలతో తనను కళకళలాడించే పక్షులను కోల్పోతూ చెట్లు బెంగపెట్టుకుంటున్నాయి. పూల దరహాసాలతో హృదయాలకు స్వాంతన చేకూర్చే ఆకుపచ్చని నందనవనాలు ఇప్పుడు ఇరుకు జీవితాల కాంక్రీటు కాసారాలైపోతున్నాయి. మనిషి జీవన మనుగడను శాసించే అతడి స్వార్థపు వలయాల్లో చిక్కుకొని విలవిలలాడే పర్యావరణాన్ని కాపాడడానికి కవిత్వమూ తనవంతు బాధ్యతగా నడుం బిగించింది. పెరిగిపోతున్న కాలుష్య కాసారాలను అడ్డుకునేందుకు ఉద్యమమై పోటెత్తింది. పచ్చటి తోరణాలతో అంతటా పర్యా వరణ తోరణాలు కట్టాలని, పర్యావరణం ఒక అంద మైన కలగానే మిగిలిపోకూడదని అది తపిస్తోంది. పచ్చ దనం పదికాలాలపాటు పదిలంగా విలసిల్లడానికి అది విభిన్న సందేశాలతో మనిషిని అప్రమత్తం చేయడానికి, అతడిలో విచక్షణ దీపాన్ని వెలిగించడానికి యత్నిస్తూనేవుంది. అతడిలోని వికృత భూతాల్ని రూపుమాపడానికి ప్రకృతిగీతమై ప్రతిధ్వనిస్తూనే వుంది.

'మూగబోయిన చెట్టును
పలకరిద్దామని చేతుల్లో పొదువుకుంటే
ఆకులకళ్లతో ఆకాశాన్ని చూపించి
శూన్యంనిండా ఇనుపచెట్ల దర్శనం
సాలెగూడులా నగరానికి అల్లుకున్న టవర్లపైన
క్రూరపు గద్దల కాపురం
మా చెట్ల కొమ్మల్లోని ఖాళీ గూళ్లలో
ఒక్క పిచ్చుకయినా కనిపించడం లేదు
పిచ్చుకలు కిచకిచల సంగీతాన్ని సృష్టిస్తేనే కదా
చెట్లకు రోజూ పండగ
గోడమీద అద్దానికి ఆనందం
ఇల్లంతా శబ్ద నృత్యవాతావరణం
ఇనుపచెట్లు తరిమేసిన పిచ్చుకల వరస
ఏ నిరాశాఎడారుల్లో మాయమైపోయిందో
ఏ రాబందుల అగ్నిసృష్టి భుగభుగల్లో
భస్మీపటలమై జ్ఞాపకంగా మిగిలిపోయిందో
గోడమీద పిచ్చుక బొమ్మొకటి
నోరుతెరిచి నన్ను ప్రశ్నిస్తున్నట్టు
మానవజాతి అభివృద్ధి కోసం
జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తున్న విధ్వంసకారుడిలా
ఆ బొమ్మముందు మోకరిల్లిన నేరస్థుణ్ణి నేను!!'

('ఇనుపచెట్లు' ఖండిక నుంచి)

అంటూ మనిషి మనుగడలో ప్రధాన భూమిక వహించే జీవవైవిధ్యం మాయమైపోతుండడం వల్ల ఆవేదన వ్యక్తం చేస్తుంది వర్తమాన కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ కలం. పక్షుల్ని కోల్పోయిన తన ఇంటి పెరట్లోని చెట్టు దుఃఖం కవిత్వమైంది. చెట్టు కోల్పోయే పక్షితో ప్రారంభమవుతుంది పర్యావరణ వినాశనం. ఆ వినాశనం ఎన్నెన్ని మానవ విపత్తులకు దారితీస్తుందో అక్షరబద్ధం చేశాడు కవి. చెట్లస్థానంలో ఇనుపచెట్లు చోటుచేసుకొని ఎంతగా మానవ జీవన కృత్రిమత్వాన్ని సృష్టిస్తుందో పేర్కొంటుంది కవిత్వం. చెట్లమీది పిచ్చుక గూళ్లన్నీ వెలవెలబోయి నందనవనాలన్నీ గద్దల ఆవాసాలుగా, సాలెగుళ్లలా మారిపోవడాన్ని దుయ్యబడుతుంది. మనిషి హృదయాన్ని అలవోకగా స్పృశించే ప్రకృతి అందాలన్నీ ఆ హృదయాన్నే శాసించే సాంకేతిక కేబుళ్లుగా మారిపోవడాన్ని ఎత్తిచూపుతుంది. మనిషి భవిష్యత్తు శూన్యాన్ని దర్శింపజేస్తోంది. పర్యావరణానికి సుతిమెత్తని ప్రతీక పిచ్చుక. మానవజాతి అభివృద్ధి పేరుతో ఆ పిచ్చుక రాబందుల కబంధహస్తాల్లో చిక్కుకొని భస్మీపటలం కాకూడదని ఆకాంక్షిస్తుంది కవిత్వం. జీవవైవిధ్యం గోడమీద బొమ్మ కాకూడదంటుంది. ఆ జీవవైవిధ్యాన్ని అక్కున చేర్చుకోవాలని తపిస్తుంది. జీవ వైవిధ్య విధ్వంసం మానవ జీవన విధ్వంసానికి దారితీయకూడదంటుంది.

'చెట్టంత మనిషి లేడు/ డబ్బంత మనిషి
ప్రకృతిలో కాలుష్యంగా వ్యాపిస్తున్నాడు
చెప్పు ఈ వ్యయనామ సంవత్సరంలో
ఎన్ని కొండల్ని వ్యయం చేసి
ఎన్ని డబ్బుల్ని కొండల్ని చేద్దాం
ఎన్ని నదుల్ని పొట్లాలు కట్టి
ఎన్ని రూపాయలు మూటకడుదాం
ఎన్ని పిట్టలకు మందుబెట్టి
ఎన్ని కట్టలతో చిందులేద్దాం
ప్రకృతి అన్నీ మనకు ఇచ్చింది
అందుకు ప్రణమిల్లాలి
మనం ప్రకృతికి ఏమీ ఇవ్వలేదు
కనీసం రాబందుకొక కళేబరాన్నైనా

('ఆదికి ముందు' ఖండిక నుంచి)

అటు సముద్రానికీ/ ఇటు కొండలకీ మధ్య
ఉక్కపోత లాంటి సరళరేఖ
ఏ అల్పా పర్వతమల్లే ఎగియదు
ఏ పర్వతమూ అలవోలె విరగదు
మధ్య ఒక తాచుపాము విషం కక్కుతూ
మెలికలు తిరుగుతుంది'

('కారిడార్' ఖండిక నుంచి)

అంటూ డబ్బుకు పూర్తిగా దాసోహమైపోయిన మనిషి కొండచిలువై పర్యావరణాన్ని కొద్దికొద్దిగా మింగడం పట్ల తూర్పారపడుతుంది అద్దేపల్లి ప్రభు కలం. చెట్టంత మనిషిని డబ్బు కాలుష్యంగా మార్చేయడాన్నీ, కొండగుట్టలన్నీ నోట్లకట్టలుగా మారి పోవడాన్నీ గుర్తించింది కవిత్వం. మనిషి దాహం తీర్చే నదీజలాలు కూడా అతని స్వార్థపుదాహంలో ఇంకిపోవడాన్ని దునుమాడింది. ప్రణమిల్లి కృతజ్ఞతలు చెప్పుకోవలసిన ప్రకృతిని విధ్వంసంచేసే మనిషి నైజాన్ని బహిర్గతం చేస్తుంది. తిమ్మిని బమ్మి చేయాలన్న మనిషి ప్రయత్నాన్ని తూర్పారబడుతుంది. మనిషి పోషించే నవనాగరీకరణ వంటి రాబందును కూడా సంతృప్తిపరచలేని దుర్భరపరిస్థితి దాపురిస్తుంది. ప్రగతి పేరుతో చోటుచేసుకునే కారిడార్‌లోని సరళరేఖ మానవజీవన సంఘర్షణ వంటి ఉక్కపోత అవుతుంది. పర్వతానికీ, సముద్రానికీ మధ్య కోతనూ, కొండల్ని పేల్చుకుంటూ నేలమీద రోడ్డు పరచు కోవడాన్నీ జీవవైవిధ్య విధ్వంసంగా అభివర్ణిస్తుంది కవిత్వం. అందుకే దానికి మెలికలు తిరుగుతూ వెళ్లే నాలుగు లైన్ల హైవే విషం కక్కే తాచుపాములా కనిపిస్తుంది. ఈ కవి అన్నట్టు 'వందలకొద్దీ పిచ్చుకలు చెట్టునిండా పూసిన పువ్వుల్లా రెక్కల్నీ, తోకల్నీ ఆడిస్తూ' చుట్టూరా చల్లే కూతల పరిమళాన్ని మనసారా అస్వాదించడానికి సమాయత్తమవుతుంది కవిత్వం.

ప్రపంచీకరణ కనుసన్నల్లో పరుగెత్తి, పరుగెత్తి పరిపరి వేదనలకు గురయ్యే మనిషి మళ్లీ ఒక్కసారి వెనుదిరిగి చూసుకుంటే పర్యావరణం ఆనవాలు కూడా కనిపించని ప్రమాదం పొంచివుందని ఎలుగెత్తి హెచ్చరిస్తోంది కవిత్వం.

-డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, సెల్: 9177732414

జననమే నీది

-వేల్పుల నారాయణ
9440433475

ఆకులు రాలుతున్నాయంటే
చెట్టుకు కొత్త అందం వస్తున్నట్టే
కాలం నగ్నంగా మార్చిందంటే
కొత్తదనం ఏదో కప్పుకోమనే

శూన్యం ఎప్పుడూ ఉండదు
ఒకటి లేకుంటే మరొక్కటి
ఇది పదార్థ నియమం
ఇది ప్రకృతి గమనం

అనుభవాల సంఘర్షణ
అంతర్మథనం జరుగుతుందంటే
కొత్త ఆలోచనేదో విస్ఫోటనం
కాబోతున్నట్లే
బిందువు బిందువు
సింధువవుతున్నట్టే

నిన్నటికి నేటికి మధ్య నిలబడ్డావంటే
రేపటికి మార్గం వేస్తున్నట్టే
రాత్రి నిద్రిస్తున్నావంటే
ఉదయం మెలుకువ వస్తున్నట్టే

నిర్బంధంలో ఉన్నావంటే
నిస్సత్తువ పోయినట్టే
అన్నీ పోగొట్టుకుంటున్నావంటే
అస్తిత్వంకోసం వెతుకుతున్నట్టే

సందిగ్ధం చౌరస్తాలో
దిక్కులు చూస్తున్నావంటే
కలబడేందుకు కార్యాచరణ ఏదో
కళ్లముందు కనిపిస్తున్నట్టే

శిశిరం వచ్చిందంటే
వసంతం ఎదురుచూస్తున్నట్టే
పదా.... మార్పు రెక్కలు తొడుక్కొని
మనుగడ సాగించడమే
జననమే నీది మరణం కాదు.

యుద్ధం ఒక కుట్ర!

**కాకిమీదో-మేకమీదో వంకపెట్టి
కావలసినపని కానిచ్చేయడం**

**ఎలుక దూరిందనడం
ఒక ప్రచారమే!
ఆ యిల్లు తగలబెట్టేయడమే నీలక్ష్యం**

**అంతా స్పష్టంగా కనబడుతోంది
వారి ఇళ్ళను కూల్చేసి
కిందున్న సొరంగాలలో నీశత్రువును పేల్చేసి
నీయుద్ధం ఆపేస్తావనే నమ్మకం
ఆవిరైపోయిందందరిలో...**

**జనావాసాల మీద బాంబులేసినపుడే
నీయుద్ధం ఉద్దేశం అర్థమైపోయింది
క్షతగాత్రులను ఆదుకునే
ఆసుపత్రులను కూడా ధ్వంసం చేసిన
నీ యుద్ధనీతిని
ఎలా చూడాలి మిస్టర్ కిల్లర్?**

**యుద్ధంలో గాయపడిన వారికి
ఓచేత్తో మందులనూ...
యుద్ధం చేస్తున్నవాడికి
మరోచేత్తో మందుగుండునూ
అవసరంగా అందిస్తూన్న మీ పెద్దన్న బుద్ధికూడా
బోధపడింది ప్రపంచానికి!**

**అసలు నీచుట్టూ వున్న
నీ సోదర రాజ్యాలన్నింటికీ యుద్ధమే కావాలి
నిజంగా మీకు కావాల్సింది
సొరంగాలలోని ఉగ్రవాదులేనా?
ఇంకా లోతుల్లోవున్న ఖనిజాలా?
నిజం చెప్పగలరా?**

**నిజంగా ఇది జాతి వైరమేనా...?చమురు నిల్వల వేటా...?
అనుసంధాన కాల్వను తవ్వి
ఆకాశానికెదగాలనే ఆశతో
లక్షలాది జనం బతుకుల్ని తవ్విపోసేస్తున్నావని
మానవజాతి గమనించలేదంటావా?**

**నెత్తుటి కూటికోసం అర్రులు చాస్తున్న ఓ దురాత్మా...!
గడ్డకట్టిన గాజా నెత్తురు
నీ గొంతుకడ్డంపడితే
ఆనక నీపరిస్థితేంటో ఆలోచించుకో!**

ఉప్పల అప్పలరాజు, 9849317608

మనిషిలో మనిషిని పరిచయంచేసే కథలు

జీవుడు- దేవుడు, ఆత్మ-పరమాత్మ, ఇహం-పరం, పుణ్యం- పాపం ఇలాంటి పదాల చుట్టూ తిరిగేదే ఆధ్యాత్మికత అని భావిస్తుంటారు. ఇది సాధారణ జనానికి అర్థం కాదు. కేవలం తత్వవేత్తలు, పండితులు మాత్రమే అర్థం చేసుకోగలుగుతారు. నిజానికి ఆధ్యాత్మికత వీటన్నింటిని అధిగమించి విస్తరించి ఉంది. మన దైనందిన జీవితాలతో ముడిపడి ఉంది. ఈ విషయం చాలామందికి తెలియదు. అది తెలిసిన వారు కనుకనే కథా రచయిత ఆర్.సి కృష్ణస్వామిరాజు అసలైన ఆధ్యాత్మికత గురించి చిన్నచిన్న కథలరూపంలో అత్యంత సులువుగా అర్థమయ్యేలా 'యోగక్షేమం వహామ్యహం' పుస్తకాన్ని వెలువరించారు. మన సమాజంతోనే ఆధ్యాత్మికత పెనవేసుకునిపోయి ఉందన్న సత్యం ఈ పుస్తకం చదివిన వారందరికీ ఇట్టే అర్థమవుతుంది. ఇందలి కథలు అంతర్లీనంగా మనిషిలో మనిషిని పరిచయం చేస్తాయి. 'ఆయన చూస్తున్నాడు', 'బలం బలహీనత', 'గుగ్గిళ్ళ రహస్యం', 'సమస్య -పరిష్కారం' 'చూసే కళ్ళు', 'ఇవ్వడంలోనే ఉంది' ఇలా తమాషా శీర్షికలతో 50కి పైగా కథల రూపంలో ఆధ్యాత్మికతను పాఠకులకు పరిచయం చేశారు రచయిత. ఈ కథలన్నీ మూడునిమిషాల లోపే చదివేయవచ్చు. కానీ ఇవి మనసుపై చూపే ప్రభావం మాత్రం చాలా కాలం ఉంటుందని గట్టిగా చెప్పగలను.

యోగక్షేమం వహామ్యహం
(ఆధ్యాత్మిక కథలు)
- ఆర్.సి. కృష్ణస్వామిరాజు
పేజీలు: 111 వెల: రూ.160/-
ప్రతులకు: 93966 2821

చంద్ర ప్రతాప్ కంతేటి, 8008143507

పరిశీలన, పరిపక్వతల నిదర్శనం 'అప్పగింతలు'

గ్రంథ సమీక్ష

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కార్యదర్శి, రమ్య భారతి సంపాదకుడు చలపాక రచించి, వెలువరించిన కథాసంపుటి 'అప్పగింతలు'. దీన్ని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సాహిత్యపోషకులు సోమేపల్లి వేంకటసుబ్బయ్యకి ప్రేమతో ప్రకాష్ అంకితమిచ్చి సాహితీ ఋణం తీర్చుకొన్నాడు. ఇప్పటికే మూడు కథాసంపుటాలు రాసి వెలువరించిన అనుభవం ఉన్న ప్రకాష్ ఈ సంపుటిలో తన దృక్కు, పరిశీలన, సునిశిత హాస్యం, సామాజిక స్పృహలకు అద్దం పట్టే కథలుగా, పరిపక్వతకు నిదర్శనంగా వీటిని శిల్పించాడు. పురస్కారాలు సైతం పొందిన ఇందలి కథలు 2021-23 మధ్య వివిధ సాహిత్య పత్రికలలో మినీ, చిన్న, పెద్ద కథలుగా ప్రచురితమైనవి.

సుజాతాదేవి గొప్ప రచయిత్రి. చాలా రచనలు చేసి కీర్తిపొందింది. తన పాతికేళ్ళరచనా పండగను 'జీవితం' పుస్తక ఆవిష్కరణ సభను అక్షర సాహిత్య సభ ఏర్పాటు చేయగా, ఎప్పుడూ సింపుల్‌గా పుస్తకావిష్కరణ చేసే ఆమె ఈసారి మాత్రం మహా వైభవంగా జరపటానికి చాలా మందిని ఆహ్వానించింది. విస్తృత ఏర్పాట్లు చేయించింది. సభా ప్రాంగణం కిటకిటలాడిపోయింది. ఆమె రావటమే ఆలస్యం. నిర్వాహకులు ఫోన్లమీద ఫోన్లు చేస్తున్నారు. ఆమెకూ ఉత్సాహం ఆగటం లేదు. డ్రైవర్‌ను స్పీడ్ పెంచమన్నది. ఇంకేముంది ప్రమాదం ముంచుకొచ్చి కారు డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టి ఆమె అకస్మాత్తుగా నెత్తురు మడుగులో చనిపోయింది. ఆమె ఫోన్ రింగ్‌టోన్ 'జగమంత కుటుంబం నాది-ఏకాకి జీవితం నాది' అని మోగు తోంది పాపం. ఆమె అభినందనసభ సంతాపసభగా మారిపోయింది. ఇవేమీ పట్టని ఆమె కొడుకులు విదేశాల నుంచి వచ్చి అంత్యక్రియలు చేసి చేతులు దులుపుకొన్నారు. తల్లి ఎందరికో ఆదర్శంగా, ప్రేరణగా నిలిచి రాసిన సాహిత్యం వారికేమీ పట్టలేదు. తల్లి ఆస్తి పంచుకొని ఆమె సాహిత్య పుస్తకాలన్నీ 'ఇంట్లో ఎందుకు వేస్ట్' అనుకొని తూకానికి అమ్మేసి పంచేసుకొని వెళ్ళిపోయారు. అప్పుడు రచయిత 'ఆకాటా సైతం విలపించింది, గోతాముల్లో కుక్కేసినందుకు, మసిచేసి ఆమె వద్దకే చేర్చేసామని కన్నీరు కార్చింది' అన్నాడు. సాహితీ వాసనలేని ఆ పుత్రరత్నాల నిర్వాకం తెలియజేసే ఈ కథ' జీవితం. పేరు చక్కగా సరిపోయింది. రాసిన విధానమూ బాగుంది.

అలాగే 'అప్పగింతలు' కథలో మనం వదిలేస్తున్న సంప్రదాయాలలోని గొప్పతనాన్ని తెలుసుకొన్న విదేశీ జాన్ కుటుంబం ఇండియాలో పెళ్ళికి వచ్చి పంచె చొక్కా ఉత్తరీయంతో, పట్టు చీరతో భార్య మేరి, కూతురు పట్టు పరికిణీతో, కొడుకు పైజమాలాల్చీలతో రావటం, అచ్చమైన తెలుగులో మాట్లాడటం వాళ్ళను రిసీవ్ చేసుకొన్న చంద్రానికి ఎయిత్ వండర్ అనిపించింది. పెళ్ళిలో అన్ని తంతులు ఆసక్తిగా గమనించారు ఆ జాన్ దంపతులు. వివరించి వాటిలోని పరమార్థం చెప్పాడు చంద్రం. అప్పగింతల సమయంలో వధువు తలిదండ్రులు ఏడవటం వారికి వింత అనిపిస్తే వివరంగా చెప్పాడు. కూలిపోతున్న వివాహాలు తలిదండ్రులను వృద్ధాశ్రమంలో చేరుస్తున్న కొడుకుల తీరు ఆవేశంగా చెప్పిన జాన్‌ను చూసి, 'జరుగు తున్న సామాజిక తప్పిదం' పై జాన్ పడ్డ ఆవేదన చంద్రం అర్థం చేసుకొన్నాడు. జాన్ కుటుంబం అమెరికా తిరిగి వెడుతూ తమ పిల్లలిద్దరికీ భారతీయ సంస్కృతీ, ఆతిధ్యం, వివాహవిధానం, ఉమ్మడికుటుంబం మొదలైన విషయాలను ఆన్‌లైన్ క్లాసులుగా నేర్పాలని వాళ్ళిద్దరూ తన మేనల్లుడు మేనకోడలు అని భావించమని 'అప్పగింతలు' చేసి వెళ్లారు. 'మీ దేశ సంస్కృతీ సాంప్రదాయాలను మేము కానుకగా తీసుకు వెడుతున్నాం. మా నుండి మీకు దిగుమతి అయిన విష సంస్కృతిని మీలాంటి వారు బొందపెట్టే ప్రయత్నం చేయాలి అన్నప్పుడు చంద్రం మనసు ఆర్ద్రమై, మంచితనం, మానవత్వం ఇలా దేశ సరిహద్దులు దాటి అందరికి ప్రేరణగా నిలవటం పరమానందాన్ని కలిగించింది. 'జగమంత కుటుంబం' కథలో ఒక తండ్రి ఇద్దరు కూతుళ్ల మధ్య అనుబంధం, ఇద్దరూ పెళ్ళిచేసుకొని ముసలాయన్ను ఒంటరిని చేసి వెళ్ళిపోతే, తమ్ముడి కూతురును ఆహ్వానించి 'మంచి ఆశయంతో ఉండేవాడు ఎప్పుడూ ఒంటరికాడు. అతనకి జగమంతా కుటుంబమే' అని చెప్పిన అనురాగాల బాంధవ్యాల ఆవశ్యకత చాటి చెప్పిన కథ.

మాసిన దుస్తులు, గడ్డమూ ఉన్న ప్రతి వాడినీ దొంగగా అనుమానిస్తే, అతని ఆకలి తీర్చటానికి భార్యకు తెలియకుండా అరటిపళ్ళు అతని చేతిలో పెట్టి 'మాసిన దుస్తులతో ఉన్న అతని ఆకలి తీర్చిన తానూ దొంగ ఏమో అని మథనపడటం మానవ చిత్త ప్రవృత్తుల ప్రదర్శించే మంచికథ. 'బ్రెయిన్ డెడ్' అయిన ఒక కుర్రాడి తండ్రిని ఒప్పించి అతడి అవయవాలు దానంచేస్తే కొందరికైనా ఉపయోగపడతాయని నచ్చచెప్పి చేయించి సంతృప్తిపడ్డ ప్రసాద్ కరోనాతో చనిపోవటం హృదయవిదారకం. అందరికి ఉపకారంచేసే ప్రసాద్‌శరీరం ఇప్పుడు ఈ మహమ్మారివలన ఉపయోగపడకపోవటాన్ని బాధగా, హృదయవిదారకంగా సానుభూతిపరంగా చిత్రించాడు చలపాక. కరోనాకాలంలో తండ్రి అంత్యక్రియలు చేసే వీలులేకపోవటంతో దెప్పి పొడుపు మాటల ఈటెలతో సమాజం పొడుస్తుంటే 'తాను ఇన్నిజాగ్రత్తలు తీసుకొన్నా నని తెలియక లోకం గ్రహించ నందుకు మనస్తాపంచెందాడు తప్పెవరిదిలో వ్యక్తి. పెళ్ళిళ్ళు లాక్ డౌన్‌లో చేస్తే ఖర్చు బాగా కలిసొస్తుందని సూక్ష్మం తెలిసి ముహూర్తాల కోసం పంతులను ఫోన్‌లో ఇబ్బంది పెడుతుంటే ఆ తెలివిఉన్న ఘటం సెల్‌ను స్విచ్ ఆఫ్‌చేసి గండం నుంచి బయటపడటం 'లాక్‌డౌన్ జాక్‌పాట్'.

బంగారుగొలుసు కోసం భర్తను వత్తిడిచేస్తే చాలీ చాలని జీతంతో ఆ కోర్కె తీర్చలేకపోతే అతడు ఆక్సిడెంట్‌లో చనిపోతే ఏదో విధంగా తంటాలుపడి అతడి కర్మకాండలు చేయించి, భర్త కట్టిన ఇన్స్యూరెన్స్ డబ్బు చేతికొస్తే తన చిరకాల కోరిక కంఠాభరణం కొనుక్కొని మెడలో వేసుకొని అద్దంలో చూసుకొంటే తన మాంగల్య చిహ్నమైన నుదుటి కుంకుమ లేకపోవటంకు బాధపడి 'మనిషి కోరుకున్నవి అన్నీ ఇవ్వడు దేవుడు. ఒకటిచ్చి ఒకటి దూరం చేస్తాడు' అని వేదాంతంగా అనుకొన్నది భార్య 'వెలితి'లో. సభలు, సమావేశాలు ఏర్పాటు చేసే ఆయనకు కరోనా, లాక్ డౌన్ కాలంలో చేతిలో పనిలేక కొంతకాలం గిజగిజ కొట్టుకొన్నా ఆ తర్వాత 'జూం' అంతర్జాతీయ వేదికలు సృష్టించి తక్కువ ఖర్చుతో ఆనందం పొందినదే 'అన్వేషణ'. ముసలమ్మను ఆటోతో ఢీకొట్టి గాయాలకు కారకుడై ఆస్పత్రిలో చేర్చిన ఆటో డ్రైవర్, ఆమె బతికి బట్టకట్టి కొంతకాలానికి చనిపోతే ఆమెను శ్మశానానికి చేర్చటానికి 'అనంత శయ్య' తెచ్చి ఆమె ఎవరోతెలిసి డబ్బులుఇస్తున్నా తెలుసుకోకుండా వెళ్ళిపోవటం 'విధి విచిత్రం' కథ. పుష్కరాలొస్తే ఆడబడుచులకు చీరా సారే పెట్టాలనే ఆనవాయితీ ఇప్పుడు బాగా పెరిగింది. రామకోటి అయినా రామరాజ్యంలాంటి రాజధాని అయినా ఆగిపోయిన దాన్ని పూర్తి చేయటం మన అందరి కర్తవ్యం అన్నాడు ''బాధ్యత''లో. కేన్సర్‌తో బక్క చిక్కి మంచానికి అతుక్కు పోయిన పిల్లాడు కోరితే ఐస్‌ముక్కలు ఇచ్చి వాడి ముఖంలో ఆనందంచూసి సంతృప్తిచెందాడు చిన్న దాన కర్ణుడు. ఒక పనిమనిషి తన యజమాని తనను ఎంత గొప్పగా మానవత్వంతో చూస్తారో సాటి పనిమనిషికి చెబుతూ 'వాళ్ళ ప్రేమకు బానిసనై పోతానేమో' అని ఆనంద భాష్పాలు రాలిస్తే 'ఈ నాటికాలంలో ఇటువంటి నిండు మానవత్వం ఉన్న మనుషులు ఇంకాఉన్నారా' అని బోల్డు ఆశ్చర్య పోయింది అవతలి పనిమనిషి . కాదుకాదు 'పని మనీ' షి' ప్రేమ బానిస'లో. రెండు రూపాయల కరివేపాకు కొని కాగితంపొట్లంలో తెస్తుంటే, పోలీసులు అది గంజాయి అని భావించి వెంట తరిమితే పారిపోతే పట్టుకొని రెండు వేలు ఫైన్ అంటే వాళ్లకు భయపడి పారిపోతున్నాను అన్నాడు 'ఉచితం' లో నాయకుడు. పిల్లలకు తండ్రి స్థానంలో ఉంటేకానీ కుటుంబ కష్టాలు తెలిసిరావు అన్న నీతి 'తండ్రి కష్టాలు'లో ఉంది. ఫ్యాన్ గాలి పడనీ తాత ఫ్యాన్ వేస్తే నిద్ర లేస్తాడని మనవడు చిట్కా కనిపెట్టిన 'అమాయకత్వం' తో ఈ సంపుటి సమాప్తం.

అమాయకంగా, చిన్న పిల్లాడిగా ముసిముసి నవ్వులతో కనిపించే చలపాక ప్రకాష్‌లో ఎంతటి నిశిత పరిశీలన ఉందో ఎన్ని మానవత్వపు విలువలకు ఆరాధకుడో, ఎంతటి వ్యంగ్యాన్ని ఒలకబోయగలడో నిరూపించిన కథా సంపుటి 'అప్పగింతలు' రాసి మనకు అప్పగించాడు. చదివి మనం ఆయనకు అభినందనలు అప్పగించి మన బాధ్యత నెర వేర్చాలి. మంచిముఖచిత్రం, చక్కని ముద్రణ ఈ సంపుటికి వన్నె తెచ్చాయి.

గబ్బిట దుర్గాప్రసాద్

నితీశ్ ద్రోహాన్ని ప్రజలు క్షమించరు

కాంగ్రెస్ ఆగ్రహం



న్యూఢిల్లీ: బీహార్‌లో మహాకూటమి ప్రభుత్వ పతనానికి కారణమైన నితీశ్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ ఊసరవెల్లితో పోల్చింది. ఆయన చేసిన ద్రోహాన్ని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ క్షమించరు అని నితీశ్ చేసిన పనిని తప్పుబట్టింది. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో న్యాయయాత్రకు ప్రధాని మోదీ, బీజేపీ భయపడ్డాయని, అందుకే ఆ యాత్ర నుంచి దృష్టి మళ్లించడానికి ఈ నాటకానికి తెరలేపాయని కాంగ్రెస్ పేర్కొంది. దీనిపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే స్పందించారు. ఇలా జరగబోతోందని బీహార్ ఉపముఖ్యమంత్రి, లాలూ ప్రసాద్ యాదవ్ ఇదివరకే సూచనప్రాయంగా చెప్పారన్నారు. అదే ఈరోజు నిజమైందని అన్నారు. ఇలాంటి వ్యక్తులు దేశంలో చాలా మంది ఉంటారని ఎద్దేవా చేశారు.

ప్రజలు గుణపాఠం నేర్పుతారు: టీఎంసీ

నితీశ్ రాజకీయ అవకాశవాదానికి ప్రజలే తగిన విధంగా స్పందిస్తారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగతారాయ్ పేర్కొన్నారు. "నితీశ్‌కుమార్ రాజకీయ విరామాలకు ప్రసిద్ధి చెందారు. అతను ప్రతిపక్ష ఇండియా కూటమి నుండి వైదొలగాలని నిర్ణయించుకోవడం దురదృష్టకరం. ఆయన ఎన్డీయేలో చేరే అవకాశం ఉంది. ఇలాంటి రాజకీయ అవకాశవాదానికి ప్రజలు తగిన సమాధానం ఇస్తారు' అని రాయ్ అన్నారు. నితీశ్ నిష్క్రమణ వల్ల ఇండియా కూటమికి వచ్చిన ముప్పేమీ లేదన్నారు. 'మిత్రపక్షం మిమ్మల్ని విడిచిపెడితే రాజకీయంగా మంచిది కాదు... కానీ, రాజకీయాల్లో ఇలాంటివి జరుగుతుంటాయి. నాయకులు వస్తుంటారు, పోతుంటారు కాబట్టి అది కుదుపు కాదు' అని అన్నారు. పేరు తెలపడానికి మరో టీఎంసీ నాయకుడు మాట్లాడుతూ... నితీశ్ కుమార్ రాజకీయ విశ్వసనీయతపై ఆందోళన వ్యక్తం చేశారు. తన చరిత్ర కారణంగా టీఎంసీ అతని విశ్వసనీయత గురించి ఎప్పుడూ భయపడేది కానీ, ఆయన్ను కాంగ్రెస్ అత్యంత విశ్వసనీయ భాగస్వామిగా పరిగణించిందని తెలిపారు. ఇదే అభిప్రాయాన్ని తెలిపిన టీఎంసీ మంత్రి ఫిర్హాద్ హకీమ్... రాబోయే లోక్‌సభ ఎన్నికలలో బీజేపీని ఓడించగల ప్రతిపక్ష కూటమి సామర్థ్యంపై విశ్వాసం వ్యక్తం చేశారు.

బీజేపీకి కృతజ్ఞతలు: తేజస్వి

నితీశ్ కుమార్ యాదవ్ మహాఘట్‌బంధన్ నుంచి వైదొలిగిన తరువాత తొలిసారి ఆర్జేడీ నేత, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ... జేడీ(యూ)-బీజేపీ కలిసి అధికారం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి కానీ, బీహార్‌లో ఆట ఇంకా ముగియలేదు. అసలు గేమ్ ముందుంది అని వ్యాఖ్యానించారు. 'ప్రస్తుత సమయంలో బీజేపీకి శుభాభినందనలు మాత్రమే చెబుతాను. నితీశ్‌కుమార్‌ను, ఆయన పార్టీని తమతో పాటు తీసుకెళ్లినందుకు బీజేపీకి నిజంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈరోజు వారు ప్రమాణ స్వీకారం చేయనివ్వండి. బీహార్‌లో ఆట ఇంకా ముగియలేదు.' అని అన్నారు.

నితీశ్ నిష్క్రమణ 'ఇండియా' కూటమికే లాభం: డీఎంకే

బీహార్‌లో మహాఘటబంధన్ కూటమి నుంచి బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నిష్క్రమించడం, బీజేపీతో పొత్తు పెట్టుకోవడం కాషాయ పార్టీకి 'నష్టం', ప్రతిపక్ష కూటమి ఇండియాకు 'లాభం' అని తమిళనాడులో అధికార డీఎంకే పేర్కొంది. నితీశ్ వ్యవహారంపై డీఎంకే అధికార ప్రతినిధి జె కాన్స్టన్‌డైన్ రవీంద్రన్ మాట్లాడుతూ... "ఈ ద్రోహ చర్యను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరు' అని అన్నారు. నితీశ్‌కుమార్ బీహార్‌లో అనుభవజ్ఞుడైన నాయకుడైనప్పటికీ, ఆయన పూర్తిగా ప్రజల విశ్వసనీయతను కోల్పోయారని, అతనికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రజానాయకుడికి సమగ్రత, విశ్వసనీయత చాలా ముఖ్యమన్నారు. ప్రజలు సరైన సమయంలో నితీశ్ కుమార్‌కు గుణపాఠం చెబుతారన్నారు.

నితీశ్‌ది రాజకీయ అవకాశవాదం

బీజేపీ నేత దిలీప్ ఘోష్

కోల్‌కతా : జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ఆర్‌జేడీ-కాంగ్రెస్ కూటమిని వీడి తిరిగి ఎన్‌డీఏలో చేరిన తీరుపై అటు కాంగ్రెస్ నుంచే కాకుండా బీజేపీ నుంచి కూడా విమర్శలు ఎదురవుతున్నాయి. నితీశ్‌ది రాజకీయ అవకాశవాదమని... ఇలాంటి వాటికి ముగింపు పలకాలని పశ్చిమ బెంగాల్ బీజేపీ మాజీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ వ్యాఖ్యానించారు. నితీశ్ వ్యవహార శైలిపై దిలీప్ ఘోష్ కోల్‌కతాలో విలేకర్లతో మాట్లాడారు. ఒక రాజకీయ నాయకుడు మామూలుగా ఐదేళ్లకు ఒకసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని, కానీ నితీశ్ కుమార్ లాంటి వాళ్లయితే వేర్వేరు శిబిరాలకు మారడం ద్వారా ఐదేళ్లలో కనీసం రెండు మూడు సార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారంటూ ఎద్దేవా చేశారు. దీన్ని రాజకీయ అవకాశవాదంగా తాను భావిస్తున్నానని... ఇలాంటి వాటిని అడ్డుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని తెలిపారు. మరోవైపు, నితీశ్ కుమార్ తీరు పట్ల దిలీప్ ఘోష్ చేసిన వ్యాఖ్యలపై స్పందించేందుకు బీజేపీ బెంగాల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సమిక్ భట్టాచార్య నిరాకరించారు. నిజానికి ప్రేమలేని పెళ్లి శాశ్వతంగా కొనసాగదని... జేడీయూ-ఆర్‌జేడీ మధ్య బంధం కూడా అలాంటిదేనన్నారు. నితీశ్ తిరిగి ఎన్డీయేలోకి రావడం ద్వారా గతంలో బీజేపీని వీడి ప్రజాతీర్పును విస్మరించడం ద్వారా చేసిన తన రాజకీయ పాపాలను ప్రాయశ్చిత్తం చేసుకున్నారంటూ వ్యాఖ్యానించారు.

అందుకే రాజీనామా చేశా: నితీశ్

పాట్నా: మహాకూటమి (మహాఘట్‌బంధన్)లో పరిస్థితులు సరిగా లేవని.. అందుకే మహాకూటమి నుంచి బయటకు వచ్చానని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తెలిపారు. ఆదివారం గవర్నర్‌కు రాజీనామా లేఖను సమర్పించిన అనంతరం బయటకు వచ్చి మీడియాతో క్లుప్తంగా మాట్లాడారు. ఏడాదిన్నరగా మహా కూటమి ప్రభుత్వం సరిగ్గా ముందుకు వెళ్లలేక పోయిందని నితీశ్ కుమార్ అన్నారు. గతంలో ఉన్న ఎన్డీఏ కూటమితో వెళ్లాలని అనుకుంటున్నామని తెలిపారు. అందరి అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. బీహార్ నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రి పదవికి ఆదివారం రాజీనామా చేశారు. సంబంధిత లేఖను గవర్నర్‌కు సమర్పించారు. దీంతో కాంగ్రెస్, ఆర్జేడీ, జేడీయూ నేతృత్వంలోని మహాకూటమి ప్రభుత్వం కూలిపోయింది.

ఇండియా కూటమి హైజాక్‌కు కాంగ్రెస్ యత్నం: జేడీయూ

గత ఏడాది డిసెంబర్ 19న అశోకా హోటల్‌లో జరిగిన సమావేశంలో కొందరు కాంగ్రెస్ నాయకులు ఇండియా కూటమిని హైజాక్ చేయడానికి ప్రయత్నించారని జేడీయూ నేత కేసీ త్యాగి ఆరోపించారు. దీనిలో భాగంగానే నాయకత్వ బాధ్యతలను ఖడ్గేకు కట్టబెట్టారన్నారు. వాస్తవానికి అంతకు ముందు ముంబైలో జరిగిన సమావేశంలో కూటమి నాయకత్వం ఎవరికీ ఇవ్వకుండానే సమష్టిగా పనిచేయాలని నిర్ణయించినప్పటికీ అశోకా హోటల్‌లో టీఎంసీ నేత మమతా బెనర్జీతో కలిసి ఖడ్గే పేరును తెరపైకి తెచ్చారన్నారు. ప్రాంతీయ పార్టీలను అంతం చేయాలని ప్రయత్నించారని త్యాగి ఆరోపించారు.

ఇది మూణ్ణాళ్ల ముచ్చటే: ప్రశాంత్ కిశోర్

నితీశ్‌కుమార్ రాజీనామా అనంతరం బీహార్‌లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్పందించారు. నితీశ్‌ను పాల్టురామ్‌గా పోల్చారు. "గత ఏడాదిగా నేను చేసిన వ్యాఖ్యలను మీరు వెనక్కి తిరిగి చూస్తే తెలుస్తోంది. నితీశ్ కుమార్ ఎప్పుడైనా కూటమి మారవచ్చని చెప్పిన ఏకైక వ్యక్తిని నేను మాత్రమే. నీతీశ్ ఒక 'పాల్టురామ్' అని ప్రజలకు ఇప్పటికే తెలుసు" అని తెలిపారు. బీహార్‌లో జేడీ(యూ)-బీజేపీ కూటమి ఎక్కువ కాలం కొనసాగలేదని ప్రశాంత్ కిషోర్ స్పష్టం చేశారు. ఈ కూటమి 2025లో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల వరకు నిలవబోదని తేల్చిచెప్పారు. ఈ విషయం తాను రాసిస్తానని ప్రశాంత్ కిషోర్ చెప్పుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన ఆరు నెలల తర్వాత మార్పు జరుగుతుందన్నారు.

'జాగరణ'లో వేదిక కూలి ఒకరి మృతి

17 మందికి గాయాలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని కల్కాజీ ఆలయంలో మతపరమైన 'జాగరణ' కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన వేదిక ఆదివారం తెల్లవారుజామున కుప్పకూలడంతో 45 ఏళ్ల మహిళ మృతి చెందగా, 17 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఈ విషాద ఘటన అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో జరిగిందని వారు తెలిపారు. మృతురాలి గుర్తింపు ఇంకా తెలియాల్సి ఉంది. గాయడిన 17 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శనివారం కల్కాజీ దేవాలయంలోని మహంత్ పరిషర్‌లో 'జాగరణ' నిర్వహించారు. దానికి సుమారు 1,600 మంది హాజరయ్యారు. నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలయంలో జరిగే కార్యక్రమానికి ఎలాంటి ముందస్తు అనుమతి ఇవ్వలేదని పోలీసు డిప్యూటీ కమిషనర్ (ఆగ్నేయ) రాజేష్ డియో తెలిపారు. 'అయితే శాంతిభద్రతల పరిరక్షణకు తగినంత మంది సిబ్బందిని నియమించాము. ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో సుమారు 1,500 నుంచి 1,600 మంది ప్రజలు గుమిగూడారు' అని ఆయన చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్వాహకులు, వీఐపీల కుటుంబాల కోసం ప్రధాన వేదిక దగ్గర ఇనుప ఫ్రేమ్‌తో కూడిన ఎత్తయిన చెక్క వేదికను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి సమయంలో ఆ వేదికపై కూర్చున్న వారి బరువును తట్టుకోలేక మధ్యలో నుంచి విరిగిపోయి ప్రమాదం చోటుచేసు కుంది. ఢిల్లీ అగ్నిమాపక దళ సేవల డైరెక్టర్ అతుల్ గార్గ్ మాట్లాడుతూ ఈ ఘటనపై అర్ధరాత్రి 12.45 గంటలకు తమ శాఖకు సమాచారం అందిందని చెప్పారు. మూడు అగ్నిమాపక యంత్రాలతో పాటు బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయని, కీర్తన వేదిక కూలిపోయిందని, కొంతమందికి గాయాలయ్యాయని, వారిని వెంటనే ఆస్పత్రులకు తరలించామని వివరించారు. కాగా, మహిళ మృతి పట్ల ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంతాపం తెలుపుతూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 'ఏ రకమైన పెద్ద కార్యక్రమంలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని నేను ఢిల్లీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను' అని తెలిపారు.

చిన్మయ్ మాండ్లేకర్‌కు శివాజీ మహారాజ్ గౌరవ్ అవార్డు

థానే: కళా రంగానికి చేసిన కృషికి గాను ప్రముఖ మరాఠీ నటుడు చిన్మయ్ మాండ్లేకర్‌ను ఛత్రపతి శివాజీ మహారాజ్ గౌరవ్ పురస్కార్‌తో సత్కరించారు. అలాగే డాక్టర్ హరివంశరాయ్ బచ్చన్ సాహిత్య రత్న పురస్కారాన్ని సాహిత్య రంగంలో విశేష సేవలందించిన జర్నలిస్ట్ హరి మృదుల్‌కు ప్రదానం చేశారు. 30వ రాష్ట్రీయ కవి సమ్మేళనం 2024లో భాగంగా ఈ అవార్డుల ప్రదానోత్సవం మహారాష్ట్రలోని థానే నగరంలో శనివారం రాత్రి జరిగింది. 2004లో జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరిలో ఉగ్రవాదులతో పోరాడుతూ వీరమరణం పొందిన జవాన్‌నాయక్ సుధాకర్ నామ్‌దేవ్ భట్‌కు మరణానంతరం మహారాణా ప్రతాప్ శౌర్య పురస్కారాన్ని అందించారు. ప్రేక్షకులు లేచి నిలబడి కరతాళ ధ్వనులు చేస్తుండగా భట్ సతీమణి అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని హిందీ భాషి ఏక్తా పరిషత్, రాజస్థానీ సేవా సమితి సంయుక్తంగా నిర్వహించాయి.

'ఇండియా' కూటమిలో

కాంగ్రెస్ సీట్ల భాగస్వామ్య అవగాహనకు వచ్చింది



కల్బుర్గి (కర్నాటక): రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపకంపై భారత కూటమిలోని అన్ని కూటమి భాగస్వామ్య పక్షాలతో తమ పార్టీ చర్చలు జరిపిందని, కొందరితో అవగాహన కుదిరిందని, మరికొందరితో చర్చలు చివరి దశలో ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.మల్లికార్జున ఖడ్గే ఆదివారం తెలిపారు. పార్టీ అధినేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కొనసాగుతున్న 'భారత్ జోడో న్యాయ యాత్ర' తో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ఆయన స్వయంగా పర్యటించడం ద్వారా లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించిందని ఆయన అన్నారు. 'మా పార్టీ భారత్ జోడో న్యాయ యాత్ర కొనసాగుతోంది. నేను తెలంగాణలో కూడా పర్యటించాను. డెహ్రాడూన్, ఒడిశా, బీహార్, ఢిల్లీ, కేరళ తదితర ప్రాంతాలకు పర్యటిస్తాను. నా పర్యటనలకు తేదీలు నిర్ణయించడం జరిగింది. రాహుల్ గాంధీ కూడా వస్తారు. కొన్ని చోట్ల, మేము ఇప్పటికే మా సన్నాహాలు ప్రారంభించాం. మా పార్టీ పని, కార్యక్రమం మేము చూస్తాము. దీనిని ఇతర పార్టీలతో పోల్చకూడదు' అని ఖడ్గే ఇక్కడ విలేకరులతో అన్నారు. కూటమి భాగస్వామ్య పక్షాలతో సీట్ల పంపకంపై కాంగ్రెస్ నేత ముకుల్ వాస్నిక్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామన్నారు. 'కమిటీ ఇప్పటికే అందరితో చర్చలు జరిపింది. బీహార్‌లోని భాగస్వాములు, ఆప్, టీఎంసీ, మా కూటమి భాగస్వాములందరితో కూడా. కొన్ని సందర్భాల్లో ఒక అవగాహన ఉంది. కొన్నింటిలో ఇది చివరి దశలో ఉంది' అని ఆయన తెలిపారు.

ఉద్యోగం లేకపోయినా... విడిపోయిన భార్యకు మనోవర్తి చెల్లించాల్సిందే

అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు

లక్నో: విడాకుల విషయంలో అందించే మనోవర్తికి సంబంధించి అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఉద్యోగం లేకున్నా విడిపోయిన భార్యకు భరణం ఇవ్వడం భర్త బాధ్యత అని స్పష్టం చేసింది. ఈ కేసులో భర్తకు కూలీగా పనిచేసే సామర్థ్యం ఉందని... అలా పనిచేసైనా మనోవర్తి చెల్లించాల్సిందేనని ఆదేశించింది. తనకు ఉద్యోగం లేనందున భరణం చెల్లించలేనన్న భర్త వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన దంపతులకు 2015లో వివాహం అయ్యింది. వరకట్నం కోసం భర్త, ఆయన కుటుంబీకులు వేధిస్తున్నారంటూ పెళ్లయిన కొన్ని రోజులకే పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య... 2016లో పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో కుటుంబ న్యాయస్థానం వీరికి విడాకులు మంజూరు చేసింది. విడిపోయిన భార్యకు మనోవర్తి కింద నెలకు రూ.2 వేలు చెల్లించాలని ఆదేశించింది. ఇలా నెలవారీ భరణం చెల్లించాలని కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ అతను ఫిబ్రవరి 21, 2023లో హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఉపాధ్యాయురాలిగా నెలకు రూ.10 వేలు సంపాదిస్తుందనే విషయాన్ని ప్రిన్సిపల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదని హైకోర్టులో వాదించాడు. అంతేకాకుండా తాను అనారోగ్యంతో బాధపడుతున్నానని, చికిత్స తీసుకుంటున్నట్లు చెప్పాడు. అద్దె నివాసంలో ఉంటున్న తనపై తల్లిదండ్రులు, సోదరీమణులు కూడా ఆధారపడ్డారని విన్నవించాడు. అయితే, భార్య ఉద్యోగం చేసి నెలకు రూ.10 వేలు సంపాదిస్తుందనే విషయాన్ని కోర్టు ముందు రుజువు చేయలేకపోయాడు. రెండు వర్గాల వాదనలు విన్న అలహాబాద్ హైకోర్టులోని లక్నో బెంచ్‌కు చెందిన న్యాయమూర్తి జస్టిస్ రేణు అగర్వాల్... అతని వాదనలను పరిగణనలోకి తీసుకోలేదు. ఉద్యోగం లేకపోయినప్పటికీ భార్యకు మనోవర్తి చెల్లించాలని స్పష్టం చేశారు. కూలీగా రోజుకు కనీసం రూ.300 నుంచి రూ.400 సంపాదించే వీలుందన్నారు. ఈ నేపథ్యంలో భర్త వేసిన రివ్యూ పిటిషన్‌ను కొట్టివేసిన న్యాయస్థానం... తీర్పు ఇచ్చినప్పటి నుంచి భార్యకు చెల్లించాల్సిన భరణం మొత్తాన్ని వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ జడ్జిని ఆదేశించింది.

బీజేపీని ఎదుర్కోవడానికి కూటమి నమూనా సమర్పించిన అఖిలేశ్

దానిని ఇతరులూ అనుసరించాలి: సమాజ్‌వాది పార్టీ

లక్నో: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవడానికి సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూటమి నమూనాను సమర్పించారని, దానిని ఇతరులు అనుసరించాలని ఆ పార్టీ అధికార ప్రతినిధి ఒకరు ఆదివారం తెలిపారు. బీహార్ ముఖ్యమంత్రి పదవికి జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ రాజీనామా చేసిన తర్వాత ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ పరిణామంపై సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి అమీఖ్ జమీ స్పందిస్తూ... జరగబోయే ఎన్నికలు మన లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడేవేనని, మా పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కాంగ్రెస్, ఆర్‌ఎల్‌డీతో సీట్ల పంపకం ప్రకటించి ఒక నమూనాను అందించారని అన్నారు. 'కాంగ్రెస్‌తో రెండో దఫా చర్చలు జరుగుతున్నాయి. బీజేపీని అధికారం నుంచి తొలగించడానికి ప్రతి ఒక్కరూ దీనిని అనుసరించాలి' అని ఆయన అన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో 11 'బలమైన' లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్‌కు ఇవ్వడం ద్వారా తమ పార్టీ పొత్తు 'శుభ ప్రారంభం' అని అఖిలేశ్ యాదవ్ శనివారం ప్రకటించారు. త్వరలో, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అశోక్ గహ్లోట్, అఖిలేశ్ మధ్య నిర్మాణాత్మక సీట్ల పంపకం చర్చలు జరుగుతున్నాయని, అయితే ఇంకా ఫార్ములా ఖరారు కాలేదని ఎస్పీ పేర్కొంది. నితీశ్ కుమార్ రాజీనామాపై జమీ మాట్లాడుతూ 'ఇలా జరగాల్సింది కాదు. బీజేపీకి అధికారం దక్కకుండా చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేసిన ములాయం సింగ్ యాదవ్ చూపిన బాటలోనే మా నాయకుడు అఖిలేష్‌జీ నడిచారు' అని తెలిపారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సురేంద్ర రాజ్‌పుత్ మాట్లాడుతూ 'ఇండియా' కూటమి విచ్ఛిన్నమైందని, బలహీనంగా ఉందని చూపించడానికి బీజేపీ, మీడియాలోని పెద్ద వర్గం ప్రయత్నిస్తున్నాయని అన్నారు. 'రాబోయే రోజుల్లో బీహార్‌లో ఏమి జరుగుతున్నా 'ఇండియా' కూటమి మరింత బలపడుతుందని మీరు చూస్తారు' అని ఆయన అన్నారు.

కుల గణన న్యాయం దిశగా తొలి అడుగు

న్యూఢిల్లీ: రాష్ట్రంలో కుల గణనను ప్రకటించడం ద్వారా న్యాయం దిశగా తొలి అడుగు వేసినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఆయన ప్రభుత్వానికి కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఆదివారం అభినందనలు తెలిపారు. దేశం శ్రేయస్సులో సమాజంలోని ప్రతి వర్గానికి సమానమైన భాగస్వామ్యం ఉండేలా కుల గణన ఒక్కటే మార్గం అని గాంధీ చెప్పారు. 'కుల గణన అనేది న్యాయానికి మొదటి మెట్టు. ఎందుకంటే ఏ సమాజం సామాజిక, ఆర్థిక ఆరోగ్యం గురించి తెలియకుండా దాని కోసం సరైన ప్రణాళికలు రూపొందించడం అసాధ్యం. సమాజంలోని ప్రతి వర్గానికి సమానమైన భాగస్వామ్యం ఉండేలా కుల గణన మాత్రమే మార్గం. దేశం శ్రేయస్సు' అని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో హిందీలో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'న్యాయం చేసేందుకు తొలి అడుగు వేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు' అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు త్వరలో కుల గణన చేపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి శనివారం తెలిపారు. మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమ శాఖలకు సంబంధించిన సమస్యలపై సమావేశం నిర్వహించిన సీఎం కుల గణన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంగన్‌వాడీల వేతనం రూ.1,000 పెంపు

కేరళ ఆర్థిక మంత్రి బాలగోపాల్

తిరువనంతపురం: రాష్ట్రంలోని 60 వేల మందికి పైగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్‌లకు రూ.1,000 వరకు ఇంక్రిమెంట్‌తో వేతనాలు పెంచుతున్నట్లు కేరళ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. పదేళ్లకు పైగా సర్వీసు ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల వేతనాన్ని రూ.1000 పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ నిర్ణయాన్ని ప్రకటించారు. ఇతరులకు రూ.500 చొప్పున వేతనాలు పెంచనున్నట్లు తెలిపారు. ఈ రంగంలోని మొత్తం 60,232 మంది కార్మికులు వేతనాల పెంపుతో ప్రయోజనం పొందనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు రూ.12,000, రూ.8,000 చొప్పున నెలవారీ జీతం తీసుకుంటున్నారు. వారు డిసెంబరు 2023 నుంచి సవరించిన వేతనాలకు అర్హులు. 258 సమగ్ర శిశు అభివృద్ధి సేవలు (ఐసీడీఎస్) కింద రాష్ట్రంలో 33,115 అంగన్‌వాడీలు ఉన్నాయి.

జ్ఞానవాపి కాంప్లెక్స్‌ను హిందువులకు అప్పగించాలి

వీహెచ్‌పీ నేత అలోక్ కుమార్ డిమాండ్

న్యూఢిల్లీ: జ్ఞానవాపి నిర్మాణాన్ని హిందువులకు అప్పగించాలని విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు అలోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆర్కియాలజీ సర్వే నివేదికను జిల్లా న్యాయమూర్తికి అందించింది. ఈ నివేదికను హిందూవులు, ముస్లింలకు కూడా ఇవ్వాలని కోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా, జ్ఞానవాపి నిర్మాణం నుంచి ఏఎస్ఐ సేకరించిన ఆధారాలు అద్భుతమైన ఆలయాన్ని కూల్చివేసి మసీదు నిర్మించినట్లు నిర్ధారిస్తున్నాయని అలోక్ కుమార్ చెప్పారు. మసీదు పరిధిని విస్తరించాడానికి సహాన్ నిర్మాణంలో స్తంభాలతో ముందుగా ఉన్న ఆలయంలోని భాగాలను మార్పులు చేసినట్టుగా ఏఎస్ఐ నివేదిక రుజువు చేస్తుందని అలోక్ కుమార్ అన్నారు. ఇక్కడ మసీదు లేదని వాజుఖానా అని పిలుపుకునే శివలింగం బట్టి స్పష్టమవుతోందని తెలిపారు. నిర్మాణంలో లభించిన శాసనాల్లో జనార్థన, రుద్ర, ఉమేశ్వర వంటి పేర్లు కనిపించడం ఇక్కడ ఆలయం ఉందని చెప్పడానికి స్పష్టమైన నిదర్శమని అన్నారు. ప్రార్థనా స్థలానికి చెందిన మతపరమైన స్వభావం 1947 ఆగస్టు ఉనికిలో ఉందని ఆయన చెప్పారు. పూజా స్థలాల చట్టం 1991లోని సెక్షన్ 4 ప్రకారం నిర్మాణాన్ని హిందూ దేవాలయంగా ప్రకటించాలన్నారు. వాజుఖానా అని పిలవబడే ప్రాంతంలో కనిపించే శివలింగానికి పూజ చేయడానికి హిందువులను అనుమతించాలన్నారు. జ్ఞానవాపి మసీదును మరొక అనువైన ప్రదేశానికి తరలించుకోవాలని ఆయన ఇంతేజామియా కమిటీని కోరారు. భారతదేశంలోని రెండు ప్రధాన వర్గాల మధ్య సత్సంబంధాలను నెలకొల్పడానికి ఈ ఉదాత్తమైన చర్య ఒక ముఖ్యమైన అడుగుగా విశ్వహిందూ పరిషత్ భావిస్తుందని అలోక్ కుమార్ చెప్పారు.

భార్య మృతదేహాన్ని 20 కిలోమీటర్లు మోసుకెళ్లిన భర్త

నవరంగపూర్: అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఓ మహిళ మృతదేహాన్ని కుటుంబ సభ్యుల సహాయంతో ఆమె భర్త 20 కిలో మీటర్లు మోసుకెళ్లిన దయనీయ ఘటన ఒడిశాలో చోటుచేసుకుంది. దీనిపై మృతురాలి భర్త అభి అమానత్య మాట్లాడుతూ 'మూడు నెలల క్రితం నా భార్య కరుణ (28) ఆడపిల్లకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితి కుములి పంచాయతీ పురుణగూడలోని తన పుట్టింట్లో ఉంటోంది. కరుణ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. అంత్యక్రియలు నా ఇంటివద్ద నిర్వహించేందుకు మృతదేహాన్ని నవరంగపూర్ జిల్లా నందహండి సమితి జగన్నాథ్‌పూర్ పంచాయతీ ఫుపుగావ్‌కు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నా. మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్, మహాప్రాణ వాహనాలకు అనేక సార్లు ఫోన్ చేసినా వారు స్పందించలేదు. వేరే వాహనంలో తీసుకెళ్లేందుకు డబ్బులు లేకపోవడంతో శనివారం ఉదయం కరుణ మృతదేహాన్ని 20 కిలోమీటర్లు మోసుకువెళ్లా' అని ఆవేదన వ్యక్తం చేశాడు.

రాబ్డీదేవికి ఢిల్లీ కోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: రైల్వే శాఖలో భూమికి ఉద్యోగాల కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఢిల్లీ కోర్టు బీహార్ మాజీ ముఖ్యమంత్రి రాబ్డీదేవి, ఆమె కూతుళ్లు మిసా భారతి, హేమా యాదవ్‌లకు సమన్లు జారీ చేసింది. ఫిబ్రవరి 9వ తేదీన కోర్టులో విచారణకు రావాలంటూ స్పెషల్ కోర్టు జడ్జి విశాల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేసిన ఛార్జ్‌షీట్‌లో ఆరోపణలకు తగు ఆధారాలున్నాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి గత ఏడాది నవంబరు నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న వ్యాపారవేత్త అమిత్ కత్యాల్‌ను సైతం తమ ముందు హాజరుపరచాలని ఆదేశించారు.

తమిళనాడులో ఘోర ప్రమాదం: ఆరుగురి మృతి

చెన్నై: తమిళనాడులో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సింగిలిపట- పున్నయపురం మధ్య జరిగిన ఈ ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సిమెంట్ బస్తాల లోడ్‌తో వెళ్తున్న ట్రక్కును కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రమాదం ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటలకు చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కారు డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తిరునేల్వేలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జగన్... ఓ ఆధునిక నియంత

వైసీపీకి వేసే ప్రతి ఓటూ బీజేపీకే

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

విశాలాంధ్ర-తిరుపతి: 'జగన్... ఓ ఆధునిక నియంత. నరేంద్రమోదీకి దత్తపుత్రుడు. వైసీపీకి వేసే ప్రతి ఓటు బీజేపికి వేసినట్లే. జగన్‌ను ఓడిస్తే బీజేపీని ఓడించినట్లే. ఏపీలో తెలంగాణ ఫలితాలు పునరావృతం కావాలి. ఇలా జరగాలంటే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అనిశ్చితి నుంచి బయట పడాలి. రాబోయే ఎన్నికల్లో కమ్యూనిస్టులతో జత కట్టాలి. అవసరమైతే కాంగ్రెస్ పార్టీని కలుపుకుపోవాలి' అని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తిరుపతి నగరంలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మోదీ ప్రధానమంత్రిగా ఉన్నంతకాలం జగన్ జైలు బయటే ఉంటారని కూనంనేని చెప్పారు. జగన్ గెలిచే ప్రతి సీటూ పార్లమెంటులో బీజేపీకి ఉపయోగపడు తుందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నపుడు రాజధాని... ప్రత్యేకహోదా... నిధుల గురించి జగన్ అనేక మాటలు చెప్పారన్నారని, తనకు అవకాశం ఇస్తే పోరాటం చేస్తానని హామీ ఇచ్చారని, తీరా అధికారం చేపట్టాక జగన్ పోరాటం వదిలేసి మోదీ జపం చేస్తున్నారని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. తెలంగాణలో కె.చంద్రశేఖర రావు, ఏపీలో జగన్ ప్రజాస్వామ్యంలో ఆధునిక నియంతలని పేర్కొన్నారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన అన్న కోసం నాడు వీధి వీధి... ఊరూ వాడా తిరిగారని, అప్పట్లో ఆమెను జగనన్న వదిలిన బాణంగా చెప్పారన్నారు. ఇపుడు అదే బాణం బూమ్ రాంగ్ అయి జగనన్న గుండెలను సూటిగా గుచ్చడానికి వెళుతోందన్నారు. మాజీమంత్రి వివేకానందరెడ్డిని ఎవరు చంపారో జగన్ ప్రజలకు చెప్పాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే హక్కు ఉందని, అందుకే తాను ఏపీ రాజకీయాలు గురించి మాట్లాడుతున్నానని సాంబశివరావు చెప్పారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయం గురించి ప్రజలు ఆలోచిస్తున్నారని, కానీ చంద్రబాబు అనిశ్చితి, అయోమయానికి మారుపేరని, స్థిరంగా ఉండలేక పోతున్నారని, దాని నుంచి చంద్రబాబు బయటకురావాలని, కమ్యూనిస్టులను కలుపుకొని ఎన్నికలకు పోవాలని సూచించారు. చంద్రబాబు పొరబాటు చేస్తే అది ప్రజా స్వామ్యానికి నష్టమని కూనంనేని అన్నారు. తిరుమలలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ్యుల సిఫారసు లేఖలు కూడా ఆమోదించాలని ఆయన డిమాండు చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ నియంతృత్వ ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. మోదీ, జగన్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తాము అనేక పోరాటాలు చేశామన్నారు. ఏపీకి బీజేపీ చేసిన ద్రోహం ఏ పార్టీ చేయలేదన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వలేదని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు విడుదల చేయలేదన్నారు. అందుకే అభ్యుదయ వాదులందరూ కలసి బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలని హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. జగన్‌ను కేసుల నుంచి ఎలా బయటపడే యటం, ప్రభుత్వాన్ని కాపాడటం కోసం టీటీడీ ఈఓ, చైర్మన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, అందుకు టీటీడీని వాడుకుంటున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు పెంచలయ్య, రాధాకృష్ణ, నగర కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర జీవిత చందాదారుగా వైఎస్ మణి

విశాలాంధ్ర - తిరుపతి: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి వైఎస్ మణి విశాలాంధ్ర జీవితచందాదారుడుగా చేరుతూ చందా మొత్తాన్ని ఆదివారం ఉదయం తిరుపతిలో సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథ్ రెడ్డికి అందజేశారు.

ద్వేషం, హింస దేశమంతటా వ్యాపిస్తోంది

రాహుల్ గాంధీ

సిలిగురి (పశ్చిమ బెంగాల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్వేషాన్ని, హింసను వ్యాపింపజేస్తోందని, పేదలు, యువత ప్రయోజనాలను పట్టించుకోకుండా బడా సంస్థల కోసం పని చేస్తోందని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఆదివారం ఆరోపించారు. ఉత్తర బెంగాల్‌లోని సిలిగురిలో 'భారత్ జోడో న్యాయ యాత్ర'లో ప్రసంగించిన గాంధీ... 'సాయుధ దళాలలో చేరాలనుకునే యువకులను స్వల్పకాలిక నియామకం కింద అగ్నివీర్ పథకాన్ని ప్రవేశపెట్టడం ద్వారా కేంద్ర ప్రభుత్వం అపహాస్యం చేసింది' అని అన్నారు. 'దేశమంతటా ద్వేషం, హింస వ్యాప్తి చెందుతోంది. దాని వల్ల ప్రయోజనం ఉండదు. ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి బదులుగా మన యువత కోసం ప్రేమ, న్యాయాన్ని వ్యాప్తి చేయడానికి మనం కృషి చేయాలి. కేంద్ర ప్రభుత్వం పేదలు, యువత కోసం కాకుండా పెద్ద సంస్థల కోసం మాత్రమే పని చేస్తోంది' అని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో తనకు లభించిన ఆదరణకు కృతజ్ఞతలు తెలిపిన గాంధీ, 'బెంగాల్‌కు ప్రత్యేక స్థానం ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో సైద్ధాంతిక పోరాటానికి నాయకత్వం వహించింది. ప్రస్తుత పరిస్థితుల్లో దేశాన్ని ఒకదానితో ఒకటి బంధించడం, ద్వేషానికి వ్యతిరేకంగా పోరాడటానికి మార్గం చూపడం బెంగాల్, బెంగాలీల కర్తవ్యం. మీరు సందర్భానికి తగినట్లుగా ఎదగకపోతే ప్రజలు మిమ్మల్ని ఎప్పటికీ క్షమించరు' అని రాహుల్ తెలిపారు.

23 రాష్ట్రాలకు బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం

న్యూదిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో బీహార్‌తో సహా 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఎన్నికల ఇన్‌చార్జిలు, సహ ఇన్‌చార్జిలను బీజేపీ నియమించింది. 80 మంది ఎంపీలుగల ఉత్తరప్రదేశ్ ఎన్నికల ఇన్‌చార్జిగా బైజయంత్ పాండాను బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు.అలాగే బీహార్‌లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే, కేరళలో కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ నియమితులయ్యారు. పంజాబ్-చండీగఢ్ బాధ్యతలను గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీకి, హరియాణా బాధ్యతలను త్రిపుర మాజీ సీఎం విప్లవ్ దేవ్‌కు అప్పగించారు. హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల ఇన్‌చార్జిగా యూపీ మాజీ మంత్రి శ్రీకాంత్ శర్మ, జమ్మూకశ్మీర్, లధక్‌కు ఇన్‌చార్జిగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుంగ్, గోవా ఇన్‌చార్జిగా పార్టీ నేత ఆశీశ్ సూద్ నియమితులు కాగా జార్ఖండ్ కోసం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్ వాజ్‌పేయి, అండమాన్ నికోబర్ దీవుల కోసం పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌ను నియమించారు. అసోం మంత్రి అశోక్ సింఘల్‌కు అరుణాచల్‌ప్రదేశ్ బాధ్యతలు అప్పగించారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాధామోహన్ దాస్ అగర్వాల్‌కు కర్నాటక, జాతీయ కార్యదర్శి అరవింద్ మెనన్‌కు లక్షద్వీప్, మహేంద్రకుమార్ సింగ్, సతీశ్ ఉపాధ్యకు మధ్యప్రదేశ్ బాధ్యతలు ఇచ్చారు. విజయ్ సింగ్ తోమర్ ఒడిశా ఇన్‌చార్జి కాగా నిర్మల్ కుమార్ సురానా పుదుచ్చేరి ఎన్నికల ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు.

నేటినుంచి ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) అధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి జరగనుంది. విశాఖపట్నం కేంద్రంగా వర్చువల్ పద్ధతిలో ఏపీఈఆర్సీ నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు అవసరమైన ఏర్పాట్లను ఏపీఈపీడీసీఎల్ ఇప్పటికే పూర్తి చేసి ఆదివారం ట్రైల్ రన్ కూడా నిర్వహించింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీజెన్కో, సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు విశాఖ చేరుకున్నారు. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామసింగ్, పివిఆర్ రెడ్డి అధ్వర్యంలో విద్యుత్ సంస్థల ప్రతిపాదనలకు సంబంధిం చిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్(వర్చువల్) ద్వారా స్వీకరిస్తారు. ప్రజాభిప్రాయ సేకరణ లో పాల్గొని విద్యుత్ పంపిణీ సంస్థల చార్జీల ప్రతిపాదనల పై 63 మంది, ఏపీజెన్కో ప్రతిపాదనల పై 8 మంది మొత్తంగా 71 మంది అభిప్రాయాలను తెలియ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం 17మంది, మంగళవారం 23మంది, బుధవారం 23మంది, గురువారం 8మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అభిప్రాయాలను తెలియజేస్తారు. ఏపీఈఆర్సీ వద్ద ముందుగా పేర్లు నమోదు చేసుకోనివారు కూడా ప్రజాభిప్రాయ సేకరణ లో పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలనుకునేవారు రాష్ట్రంలోని తమ సమీప విద్యుత్ పర్యవేక్షణ ఇంజినీరు (ఎస్ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఈఈ) కార్యాలయాల్లో సంప్రదించి ఏపీఈఆర్సీ వారి అనుమతితో పాల్గొనవచ్చు. రోజూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 వరకూ జరగనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు https://www.apeasternpower.com/apercpublichearing వెబ్ లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించే అవకాశాన్ని అధికారులు కల్పించారు.

గవర్నర్ ఖాన్‌ది అదొక అజెండా

- బీజేపీ మద్దతుతో వ్యవహరిస్తున్నారు...
- 'బైఠాయింపు'పై కేరళ సీపీఎం నేతల ధ్వజం

తిరువనంతపురం: గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ఒక అజెండాతో, బీజేపీ పాలిత కేంద్రం మద్దతుతో వ్యవహరిస్తున్నారని కేరళలోని అధికార సీపీఎం ఆదివారం విమర్శించింది. సీపీఎం అనుబంధ విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ నల్లజెండాలతో నిరసన తెలియజేయడాన్ని వ్యతిరేకిస్తూ గవర్నర్ ఖాన్ నాటకీయంగా బైఠాయించిన ఒక రోజు తర్వాత సీపీఎం ఈ వ్యాఖ్యలు చేసింది. గవర్నర్ భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని మోహరించినప్పటికీ, దక్షిణాది రాష్ట్రంలో ఆయనకు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతాయని వామపక్ష పార్టీ తెలిపింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కేరళ రాష్ట్రం నిజాయితీ, చిత్తశుద్ధితో రాజకీయ కార్యకలాపాలు సాగించే రాష్ట్రమని, ఇలాంటి చర్యలను తాము సహించబోమని అన్నారు. ఖాన్ ఉద్దేశం ఏమిటంటే, తనపై దాడి జరిగే దృష్టాంతాన్ని రూపొందించడం, తద్వారా రాష్ట్రంపై చర్య తీసుకోవాలని కేంద్రాన్ని ఒత్తిడి చేయడం అని ఆయన ధ్వజమెత్తారు. ఇవన్నీ అజెండాలో భాగమేనని, కేంద్రానికి తెలిసి ఆయన ఇలా వ్యవహరిస్తున్నారని, ఏం చేసినా వచ్చే (లోక్‌సభ) ఎన్నికల్లో బీజేపీ ఏమీ సాధించబోదని గోవిందన్ స్పష్టం చేశారు. శనివారం కొల్లాం జిల్లా నిలమేల్‌లో తనకు నల్లజెండాలు చూపిన ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు తన కారును ఢీకొట్టారని ఖాన్ చేసిన ఆరోపణలను 'అబద్ధం'గా అభివర్ణించారు. టెలివిజన్ ఛానళ్లు ఈ సంఘటన దృశ్యాలను ప్రసారం చేయడంతో ఇప్పుడు ప్రపంచం మొత్తానికి స్పష్టమైందని వామపక్ష నాయకుడు తెలిపారు. నిరసనకారులు గవర్నర్ కారు సమీపంలో ఎక్కడా లేరని, కేకలు వేస్తూ వారి వద్దకు వెళ్లింది అరిఫ్ మహ్మద్ ఖాన్ అని అన్నారు. దక్షిణాది రాష్ట్రంలో శాంతిభద్రతలు చెక్కుచెదరకుండా ఉన్నాయని పేర్కొంటూ, కేరళలో కాకుండా మరెక్కడా గవర్నర్ ఇలాంటి దుకాణం ముందు కూర్చోగలరా అని ప్రశ్నించారు. గవర్నర్ భద్రత కోసం సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని మోహరించడాన్ని కూడా విమర్శించిన వామపక్ష నేత, కేంద్ర బలగాల రాకతో ఆయనపై నిరసనలు ఆగవని స్పష్టం చేశారు. ఎల్‌డీఎఫ్ కన్వీనర్ ఇపి జయరాజన్, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు టీ.ఎం.థామస్ ఐజాక్ కూడా ఆందోళనల నేపథ్యంలో సీఆర్‌పీఎఫ్ మోహరింపుపై గవర్నర్, కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. గవర్నర్ భద్రత కోసం కేంద్ర బలగాలను మోహరించడం సమాఖ్య సూత్రాలను ఉల్లంఘించడమేనని జయరాజన్ అభివర్ణించగా, రాష్ట్రానికి ఏ శక్తి వచ్చినా నిరసనలు కొనసాగుతాయని ఐజాక్ అన్నారు. 'ఇవన్నీ హాస్యాస్పదమైన డ్రామాలు... గవర్నర్ భద్రత విషయంలో ఇప్పటి వరకు జరిగిందా? నిరసనలు జరిగాయి. అయితే సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని మోహరించినా అది కొనసాగుతుంది' అని ఐజాక్ అన్నారు. గవర్నర్‌ను రీకాల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతుందా అని అడిగిన ప్రశ్నకు. ఈ విషయంపై రాజకీయ నిర్ణయం తీసుకోవాలని ఆర్థిక శాఖ మాజీ మంత్రి అన్నారు. గోవిందన్ కూడా ఖాన్‌ను రీకాల్ చేస్తే ప్రత్యేక ప్రయోజనం ఉండదని, కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా అతని స్థానంలో ఇలాంటి వ్యక్తిని తీసుకుంటుందని తెలిపారు.

నేటి చట్టాలే రేపటి భారత్‌కు బలం

సుప్రీంకోర్టు వజ్రోత్సవ సభలో మోదీ

న్యూదిల్లీ: నేటి చట్టాలు రేపటి భారత్‌కు బలమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా చట్టాలను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు వజ్రోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించారు. మూడు కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకురావడం ద్వారా భారత న్యాయ, విధానాలు, దర్యాప్తు వ్యవస్థలు కొత్త శకంలోకి అడుగు పెట్టాయని చెప్పారు. కొత్త చట్టాల అమలు సజావుగా సాగాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా వారి సామర్థ్యాన్ని పెంచేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఇతర భాగస్వాముల సామర్థ్యాన్ని పెంచేందుకు సుప్రీంకోర్టు ముందుకు రావాలని కోరారు. సాధికార న్యాయ వ్యవస్థ... వికసిత్ భారత్‌లో భాగమని మోదీ అన్నారు. నమ్మకమైన న్యాయ వ్యవస్థ ఏర్పాటు కోసం తమ ప్రభుత్వం నిర్విరామంగా పనిచేస్తూ అనేక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. జన్ విశ్వాస్ బిల్లు ఈ దిశగా పడే ముందడుగన్నారు. మధ్యవర్తిత్వ చట్టం వల్ల కోర్టులపై భారం తగ్గుతుందని, ప్రత్యామ్నాయ వివాదాల పరిష్కార యంత్రాంగం మెరుగవుతుందని మోదీ తెలిపారు. ఉజ్వల ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు సుప్రీంకోర్టు ఎంతో కృషిచేసిందని, వ్యక్తిగత చట్టాలు, వాక్‌స్వేచ్ఛపై కీలక తీర్పులు వెలువరించిందని, తద్వారా దేశ సామాజిక-రాజకీయ స్థితికి నూతన దిశ లభించిందన్నారు. అంతర్జాతీయ పరివర్తనాలతో ప్రపంచ దృష్టి భారత్‌పై ఉందని, దేశంపై ప్రపంచానికి నమ్మకం పెరుగుతోందని, ఈ క్రమంలో అందివచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. సుప్రీంకోర్టు భవన విస్తరణకు రూ.800కోట్లను కేంద్రం మంజూరు చేసిందని గుర్తుచేశారు. సరళీకృత న్యాయం ప్రతి పౌరుడి హక్కు అని, అందుకు మాధ్యమం సుప్రీంకోర్టు అని మోదీ అన్నారు. సబార్డినేట్ కోర్టుల డిజిటల్ మౌలికవసతుల మెరుగుదలకు ఈ-కోర్టుల ప్రాజెక్టు మూడవ దశపై తాజా నిర్ణయం దోహదమవు తుందని, ఈ ప్రాజెక్టు పూర్తి అయితే చివరి వ్యక్తి కూడా న్యాయం అందుతుందని ప్రధాని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పులను స్థానిక భాషల్లో అనువదిస్తుండటాన్ని ప్రస్తావిస్తూ మిగతా కోర్టులు కూడా దీనిని అనుసరిస్తాయని ఆశిస్తున్నానన్నారు. సాంకేతికత వినియోగంలో సమస్యలు రావచ్చుగానీ న్యాయాన్ని అందించే పరిధులను ఇది విస్తరిస్తుందని మోదీ అన్నారు. సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి ఎం.ఫాతిమా బీవీకి పద్మభూషణ్ ఇచ్చామని చెప్పారు. సుప్రీంకోర్టు వజ్రోత్సవాన్ని పురస్కరించుకొని డిజిటల్ సుప్రీంకోర్టు రిపోర్ట్స్ (డిజి ఎస్‌సీఆర్), డిజిటల్ కోర్ట్స్2.0, సుప్రీంకోర్టు కొత్త వెబ్‌సైట్‌ను ప్రధాని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీజేఐ డీవై చంద్రచూడ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఉన్నత న్యాయాధికారులు, న్యాయమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ పాల్గొన్నారు.

బీజేపీది 'అన్యాయ కాలం'

- వాస్తవాలకు సుదూరంగా ప్రభుత్వ గణాంకాలు
- వన్నె అద్ది మెప్పించే తుది బడ్జెట్ ఒట్టి మిథ్య
- న్యాయమే కాంగ్రెస్ అజెండా : పవన్ ఖేరా

న్యూదిల్లీ: దేశంలో బీజేపీ దుష్పవర్తన కొనసాగుతోందని, 140 కోట్ల మంది భారతీయులు అన్యాయ కాలంలో జీవిస్తున్నారని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. వాస్తవాలకు సుదూరంగా ప్రభుత్వ గణాంకాలు, మాటలు ఉంటున్నాయని ఎద్దేవా చేసింది. త్వరలో ప్రవేశపెట్టబోయే తుది బడ్జెట్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దే కసరత్తు జరుగుతుంది తప్ప అందులో వాస్తవాలు ఉండబోవని విమర్శించింది. న్యాయమే అజెండాగా కాంగ్రెస్ ముందుకు వెళుతోందని పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా అన్నారు. తమ పార్టీ న్యాయం చేస్తామన్న హామీనిస్తోందన్నారు. వాస్తవాలు కప్పిపుచ్చడంలో బీజేపీ ఆరితేరిందని, నిజాలను దాచి తతంగాలు చేయడంలో ఆ పార్టీ దిట్టని విమర్శించారు. పవన్ ఖేరా ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. వికసిత్ భారత్ ఓ డొల్ల నినాదమని, నిరుద్యోగంలో భారత్‌ను విశ్వగురువును మోదీ ప్రభుత్వం చేసిందని విమర్శించారు. 45ఏళ్ల గరిష్ఠానానికి నిరుద్యోగం చేరిందన్నారు. దేశంలో ఏం జరుగుతుంది... ఆర్థికస్థితి ఏమిటన్నవి బయటకు రానివ్వకుండా ఓ కార్యాన్ని తెరమీద నడుపుతూ నిజనిజాలను తెర చాటునకు నెట్టివేయడమే బీజేపీ పనన్నారు. 80కోట్ల మంది ఉచిత రేషన్‌పై ఆధారపడుతున్నట్లు చెప్పుకునేందుకు ప్రభుత్వం సిగ్గుపడాలని అన్నారు. ఉత్తరప్రదేశ్, హరియాణా రాష్ట్రాల యువత ఉపాధి కోసం ఇజ్రాయిల్ బాట పడుతున్నారన్న వాస్తవాన్ని బీజేపీ ప్రభుత్వం తొక్కిపెట్టేసిందని వ్యాఖ్యానించారు. తన ఇల్లు, కుటుంబం, దేశాన్ని వదిలి యుద్ధాన్ని ఎదుర్కొంటున్న దేశానికి వెళ్లి కార్మికుడిగా పనిచేయాలని ఓ వ్యక్తి సిద్ధమైన పరిస్థితి కలచివేస్తోందన్నారు. తమకొచ్చే నెలసరి ఆదాయం రూ.10వేలకు దాదాపు 13-14 రెట్లు ఎక్కువగా ఇజ్రాయిల్ ఇస్తుండటంతో ఆ దేశానికి వెళ్లేందుకు యువత సిద్ధమయ్యారని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో 60వేల పోలీసు కానిస్టేబుళ్ల పోస్టులకుగాను 51లక్షల దరఖాస్తులు వచ్చాయంటే నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని ఖేరా వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్ అనే డొల్ల నినాదంతో పరిపాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వం త్వరలో తుది బడ్జెట్‌ను అత్యద్భుతమైనదిగా చూపే ప్రయత్నాన్ని చేస్తుందని, ప్రగల్భాలు... ప్రధానిపై ప్రశంసలతో కూడిన పేరాలు చదువుతూ ఆర్థిక మంత్రిబడ్జెట్ ప్రసంగం చేస్తారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వాస్తవికత మసకబారేలా బడ్జెట్ ప్రసంగం ఉండరాదన్నారు. కనిపిస్తున్న దానికి వాస్తవాలకు పొంతన లేదని ఆర్థిక వ్యవస్థనుద్దేశించి పవన్ ఖేరా అన్నారు. సగానికి పైగా జనాభా నెలకు రూ.32వేల కంటే తక్కువ ఆదాయాన్ని పొందుతోందని, దిగువనుండే 10శాతం మంది సగటు నెలజీతం రూ.6వేలు మాత్రమేనని వెల్లడించారు. గత ఐదేళ్లలో వాస్తవ గ్రామీణ వేతనాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయని, పేదరికం తగ్గినట్లు మోదీ ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోంది కానీ వాస్తవ పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయని పవన్ ఖేరా అన్నారు. గత పదేళ్లలో భారత్‌ను నిరుద్యోగంలో విశ్వగురువుగా మోదీ ప్రభుత్వం నిలిపిందని, నిరుద్యోగం 45ఏళ్ల గరిష్ఠానికి చేరిందని విమర్శించారు. ఎన్నికైన ప్రభుత్వాలను దొడ్డిదారిన కూల్చడంలో మోదీ ప్రభుత్వం బిజీగా ఉండగా ఆర్థిక సంక్షోభం అపరిష్కృతంగా ఉండిపోతోందని, దీనిని బట్టి ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏమిటో స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగస్వాములు కావడం ద్వారా వాస్తవాలు తెలుస్తాయని పిలుపునిచ్చారు. 'న్యాయం' అజెండాతో కాంగ్రెస్ ముందుకు వెళుతున్నట్లు పవన్ ఖేరా వెల్లడించారు.

రిజర్వేషన్ల రద్దుకు సర్కార్ కుట్ర

- జైరామ్ రమేశ్ విమర్శ
- యూజీసీ ప్రతిపాదన ఉపసంహరణకు డిమాండ్

న్యూదిల్లీ: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను రద్దుచేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. ఉన్నత విద్యా సంస్థల్లో రిజర్వేషన్లను ఎత్తివేసి... జనరల్ విభాగం కిందకు ఆయా సీట్లను తెచ్చేందుకు యత్నిస్తోందని దుయ్యబట్టింది. దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనుల విషయంలో మోదీ ప్రభుత్వం 'కంటితుడుపు' రాజకీయాలు చేస్తోందని వ్యాఖ్యానించింది. ఉన్నత విద్యా సంస్థల (హెచ్ఈఐ) పోస్టులలో ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలకున్న రిజర్వేషన్ స్థానాలను అవకాశముంటే జనరల్ కేటగిరికి మళ్లించేలా ముసాయిదా మార్గదర్శకాలను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) జారీ చేసిన మీడియా నివేదికను 'ఎక్స్'లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పెట్టారు. ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 'కొన్నేళ్ల కిందట ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ రిజర్వేషన్ల పున:పరిశీలన గురించి మాట్లాడారు. ఇప్పుడు ఉన్నత విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్ర జరుగుతోంది. భగవత్ ఉద్దేశాలకు అనుగుణంగా యూజీసీ తాజా ప్రతిపాదనతో దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరుగుతుందని స్పష్టమవుతోంది' అని జైరామ్ రమేశ్ హిందీలో ట్వీట్ చేశారు. దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనుల విషయంలో మోదీ ప్రభుత్వ వాస్తవ ఉద్దేశానికి యూజీసీ తాజా ప్రతిపాదన అద్దం పట్టిందని దుయ్యబట్టారు. అన్యాయంపై, రాజ్యాంగం మీద దాడులను ప్రతిఘటిస్తున్నామన్నారు. కాలేజీలు, వర్సిటీల్లో రిజర్వేషన్లను ఎత్తివేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తాజా ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు. అయితే యూజీసీ ప్రతిపాదన, ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా జేఎన్‌యూ విద్యార్థి సంఘం (జేఎన్‌యూఎస్‌యూ) ఆందోళనకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

ఉద్యోగాలివ్వకుంటే రాజీనామా చేయండి : కేజ్రీవాల్

చండీగఢ్: అన్ని రాజకీయ పార్టీలను చూసి విసిగిపోయిన హరియాణా ప్రజలు మార్పు కోసం చూస్తున్నారని ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. నిరంతర విద్యుత్, ఉద్యోగాలు, నాణ్యమైన విద్య, వైద్యం వంటివి ఆప్ మాత్రమే కల్పించగలదన్నారు. కాంగ్రెస్, బీజేపీ, జేజేపీ ఎప్పటికీ ఇలాంటి వసతులు కల్పించలేవని... అది ఆమ్ ఆద్మీ పార్టీకి మాత్రమే సాధ్యమన్నారు. ఆదివారం హరియాణాలో కేజ్రీవాల్ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేజ్రీవాల్ మాట్లాడారు. గతంలో దిల్లీలో రోజూ ఏడెనిమిది గంటల పాటు విద్యుత్ కోతలు ఉండేవని... ఇప్పుడు 24 గంటల పాటు అందుతోందని చెప్పారు. హరియాణాలో బీజేపీ-జేజేఎం ప్రభుత్వాన్ని యువకులు ఉద్యోగాలు అడిగితే... వాళ్లను ఇజ్రాయిల్‌కు పంపిస్తున్నారన్నారు. యుద్ధంతో రగులుతోన్న పరిస్థితుల్లో ఆ దేశానికి బిడ్డలను చావడానికి పంపిస్తున్నారా? అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వలేకపోతే రాజీనామా చేయాలని... కొలువులు ఎలా ఇవ్వాలో మేం చేసి చూపిస్తామన్నారు. 'నేనొక ఇంజినీర్‌ని. చదువుకున్న వివేకవంతుడిని. నేనేమీ నిరక్షరాస్యుడిని కాదు... నకిలీ డిగ్రీ నాకు లేదు. అందువల్ల 24 గంటల పాటు విద్యుత్ ఎలా అందించాలి? వంటి విషయాలన్నీ బాగా తెలుసు. నన్ను అరెస్టు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఐటీ, సీబీఐ, ఈడీ, దిల్లీ పోలీసుల్ని ప్రయోగిస్తోంది. జైలుకెళ్లేందుకు నేను భయపడను. నేను హరియాణాకు చెందినవాడినే. హరియాణా వాలాను భయపెట్టేందుకు ప్రయత్నించొద్దని వారికి చెప్పాలనుకొంటున్నాను. నేను రాముడు, ఆంజనేయుడి భక్తుడిని. రామరాజ్యం స్ఫూర్తితో దిల్లీ, పంజాబ్‌లో పాలన కొనసాగిస్తున్నాం. మేం పవర్ కోసం ఇక్కడికి రాలేదు. సేవ చేసేందుకు వచ్చాం. పంజాబ్‌లో ఇప్పటివరకు మా ప్రభుత్వం 42 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించింది' అని చెప్పారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం 'ఇండియా' కూటమితోనే కలిసి వెళతాం. హరియాణాలోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు ఈ ఏడాది చివరిలో జరగబోయే ఎన్నికల్లో ఆప్ ఒంటరిగానే బరిలో దిగుతుంది' అని తెలిపారు.

ఉప్పల్ టెస్ట్‌లో భారత్ ఓటమి

- 7వికెట్లతో చెలరేగిన స్పిన్నర్ హార్ట్‌లే
- 28 పరుగుల ఆధిక్యంతో నెగ్గిన ఇంగ్లాండ్

హైదరాబాద్: భారత్-ఇంగ్లాండ్ జట్ల మధ్య ఉప్పల్ వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత్ ఓటమి పాలైంది. తొలి ఇన్నింగ్స్‌లో 190 పరుగుల ఆధిక్యం సాధించినప్పటికీ విజయం కోసం తీవ్రంగా చెమటోడ్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్ల పోరాటం చేసినా సరిపోలేదు. దీంతో ప్రత్యర్థి ఇంగ్లాండ్ జట్టు నిర్దేశించిన 231 పరుగుల లక్ష్యఛేదనలో 202 పరుగులకే భారత్ ఆలౌట్ అయింది. దీంతో మరొక రోజు ఆట మిగిలి ఉండగానే ఇంగ్లాండ్ 28 పరుగుల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ రోహిత్ (39), అశ్విన్(28), శ్రీకర్ భరత్(28), కేఎల్ రాహుల్ (22) పరుగులు చేశారు. మిగతా ఆటగాళ్లు విఫలమయ్యారు. ప్రత్యర్థి బౌలర్లలో టామ్ హార్ట్‌లే 7, జో రూట్, జాక్ లీచ్ చెరో వికెట్ తీశారు. ఈ విజయంతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 231 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఓపెనర్లు కెప్టెన్ రోహిత్ శర్మ, యశస్వి జైశ్వాల్ మంచి ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని అందించారు. జైశ్వాల్ 15 పరుగులు చేసి ఔట్ అవ్వగా, రోహిత్ శర్మ 39 పరుగులు చేసి టామ్ హార్ట్‌లే బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఇక ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు ఎవరూ కూడా పెద్ద స్కోర్ చేయలేకపోయారు. వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన శుభ్‌మన్ గిల్ మరోసారి వచ్చిన అవకాశాన్ని కూడా ఉపయోగించుకోలేకపోయాడు. ఒక్క పరుగు కూడా చేయకుండానే డకౌట్‌గా వెనుదిరిగాడు. అక్షర్ పటేల్ 17 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. నిలకడగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించి 22 పరుగులు చేసిన కేఎల్ రాహుల్‌ను రూట్ దెబ్బకొట్టాడు. దీంతో భారత్ 32.4 ఓవర్లలో 107 పరుగులు చేసి ఐదో వికెట్‌ను కోల్పోయింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 119 పరుగుల వద్ద రనౌట్ కాగా, చివరల్లో అశ్విన్(28), భరత్ (28) జట్టును గెలిపించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. వీరిద్దరు ఎనిమిదో వికెట్‌కు 57 పరుగులు జోడించారు. స్వల్ప వ్యవధిలో ఈ ఇద్దరు ఔట్ అవడంతో భారత్ ఆశలు ఆవిరయ్యాయి. అశ్విన్-భరత్ ఔట్ అయ్యాక బుమ్రా, సిరాజ్ కాసేపు క్రీజ్‌లో ఉండి పోరాడినప్పటికీ విజయతీరాలకు చేర్చలేకపోయారు. కాగా, ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 246 పరుగులు చేయగా, రెండో ఇన్నింగ్స్ లో 420 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లలో బుమ్రా 4 వికెట్లు, రవిచంద్రన్ అశ్విన్ 3, రవీంద్ర జడేజా 2 వికెట్లు తీశారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 436 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో 202 పరుగులకు ఆలౌట్ అయింది. ఇంగ్లాండ్ బౌలర్లలో టామ్ హార్ట్‌లే 7 వికట్లు తీసి టీమిండియా పతనాన్ని శాసించాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.